# శుభోదయం

ప్రతీ అక్షరం..ప్రజా సమరం......!

WWW.SUBHODAYAMDAILY.COM

అమరావతి,హైదరాబాద్, సంపుటి : 01, సంచిక : 239, పేజీలు : 08, ఎడిటర్ : వి. శ్రీనివాసరావు ( 9491020055) మంగళవారం - 12 - నవంబర్ - 2024


## తొలిసారి ఆ గ్రామంలో ఎన్నికల పండుగ



మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా కిన్వాట్ తాలూకాలోని వాగ్దారి గ్రామం గ్రామంలోని 190 మంది ఓటర్లు స్థానికంగానే ఓటు గ్రామ ప్రజలు తొలిసారిగా తమ గ్రామంలో ఓటు వేయనున్నారు

## లెబనాన్‌లో సమాధుల కింద హిజ్బుల్లా భారీ సొరంగం.. గుర్తించిన ఇజ్రాయెల్..



లెబనాన్‌పై కొనసాగుతున్న ఇజ్రాయెల్ దాడులు

సరిహద్దుకు 1.5 కిలోమీటర్ల దూరంలో సమాధుల కింద భారీ సొరంగ నిర్మాణం

అందులో కమాండ్ కంట్రోల్ రూములు, తుపాకులు, రాకెట్ లాంచర్లు

ధ్వంసం చేసినట్టు పేర్కొన్న ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్

## అయోధ్య రామ మందిరం పునాదుల్ని పెకిలిస్తాం.. ఖలిస్థానీ ఉగ్రవాది పన్నూన్ బెదిరింపులు



న్యూఢిల్లీ : సిక్కు వేర్పాటువాద నాయకుడు, ఖలిస్థానీ ఉగ్రవాది గురుపత్వంత్ సింగ్ పన్నూన్ మరోసారి తీవ్ర బెదిరింపులకు పాల్పడ్డారు. అయోధ్యలోని రామ మందిరం సహా హిందూ ఆలయాలను లక్ష్యంగా చేసుకొని హెచ్చరికలు జారీ చేశారు. నవంబర్ 16, 17 తేదీల్లో ఆలయాలపై దాడి చేస్తామంటూ హెచ్చరించాడు.

## మూసీ ప్రాంతంలో మైనార్టీల ఇళ్లను కాంగ్రెస్ ప్రభుత్వం కూల్చేస్తోంది: కేటీఆర్



- కాంగ్రెస్ మూసీ ప్రాంతంలో మైనార్టీల ఇళ్లను కూలుస్తోందని విమర్శ
- కేసీఆర్ హయాంలో రాష్ట్రంలో గంగాజమున తెహజీబ్ పాలన సాగిందన్న కేటీఆర్
- బీఆర్ఎస్ హయాంలో మైనార్టీలకు పదవుల్లో ప్రాధాన్యత ఇచ్చామని వెల్లడి

# బాబు మార్క్ బడ్జెట్...
# రెండూ చూసుకుంటూ !




- ఈసారి ప్రవేశపెట్టే బడ్జెట్ డిసెంబర్ జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలకు సంబంధించి ఉంటుంది
- అది 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉండొచ్చు
- ఈ బడ్జెట్ ని ఫుల్ మీల్స్ గానే తీసుకుని రాబోతున్నారు
- బడ్జెట్ ప్రవేశపెట్టే వేళకు పోలవరానికి ప్రపంచ బ్యాంక్ ఆసియన్ బ్యాంక్ నిధులు
- ఈ బడ్జెట్ ద్వారా కూటమి ప్రభుత్వం అటు అభివృద్ధి ఇటు సంక్షేమం రెండింటినీ బ్యాలెన్స్ చేసేలాగానే చూస్తుంది

అమరావతి : దాదాపుగా ఆరున్నరేళ్ల తరువాత ముఖ్య మంత్రి చంద్రబాబు నాయకత్వంలోని టీడీపీ కూటమి ప్రభుత్వం పూర్తి స్థాయి బడ్జెట్ ని ప్రవే శపెట్ట బోతోంది. 2018లో పూర్తి బడ్జెట్ ని ప్రవేశపెట్టిన మిగతా..2లో

## ఏపీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై బడ్జెట్ ప్రసంగంలో మంత్రి ఏమన్నారంటే..?



2లో

- మహిళా శిశు సంక్షేమానికి 4 వేల కోట్ల నిధుల కేటాయించిన ప్రభుత్వం
- తల్లికి వందనం పథకానికి నిధులు కేటాయిస్తామన్న మంత్రి
- పేదరికంతో రాష్ట్రంలో ఒక్క విద్యార్థి కూడా చదువుకు దూరం కావొద్దని వ్యాఖ్య
- దీపం పథకంతో ఏటా మూడు సిలిండర్లు.. 5 లక్షల మందికి లబ్ధి

## మోదీ ఆ ఆరోపణలు నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా.. సిద్దరామయ్య సవాల్



- మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో సిద్దరామయ్య సర్కారుపై మోదీ తీవ్ర ఆరోపణలు
- ఎక్సైజ్ శాఖలో రూ. 700 కోట్ల కుంభకోణం జరిగిందన్న ప్రధాని
- ఆ సొమ్మును మహారాష్ట్ర, ఝార్ఖండ్ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ వాడుకుంటోందన్న మోదీ
- ఆరోపణలు నిరూపించకుంటే మోదీ రాజకీయాల నుంచి తప్పుకోవాలని కర్ణాటక సీఎం డిమాండ్

## అసెంబ్లీకి వెళ్లే దమ్ము, ధైర్యం లేకపోతే రాజీనామా చేయండి: జగన్ పై షర్మిల విసుర్లు



2లో

- నేటి నుంచి ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు గైర్హాజరైన జగన్
- ప్రతిపక్ష హోదా ఇస్తేనే సభకు వెళతాననడం అర్థరహితమన్న షర్మిల
- పిచ్చితనాన్ని పక్కనబెట్టి అసెంబ్లీ సమావేశాలకు హాజరు కావాలని హితవు

అమరావతి : ఇవాళ్టి నుంచి ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో, వైసీపీ అధినేత జగన్ సభకు గైర్హాజరయ్యారు. దీనిపై రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు మిగతా..2లో

### మూసీ వివాదంపై బీఆర్ఎస్‌కు చెక్ పెట్టేందుకు సీఎం రేవంత్ కొత్త స్కెచ్..

## సెంటిమెంటును పండిస్తున్నారా..?




- మూసీ పునర్జీవనం కాంగ్రెస్ బీఆర్ఎస్ ల మధ్య పొలిటికల్ వార్ గా మారింది
- హైదరాబాద్ కేంద్రంగా సీఎం రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని బీఆర్ఎస్, బీజేపీ అగ్ర నేతలు విమర్శల దాడి
- సీఎం రేవంత్ పాల్గొన్న మూసి పునర్జీవ సంకల్ప యాత్రతో రాష్ట్రంలో పొలిటికల్ హీట్ పెరిగింది
- మూసి పునర్జీవ సంకల్ప పాదయాత్రతో కాంగ్రెస్ ప్రభుత్వం దూకుడు పెంచింది

హైదరాబాద్ : ఆరు నూరైనా మూసీ నది పునరుజ్జీవం కోసం ముందుకు వెళతామని ప్రకటించిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. ఆ దిశలో వడివడిగా అడుగులు వేస్తున్నారు. యాదాద్రి జిల్లాలో మూసి పునర్జీవ సంకల్ప పాదయాత్రతో కాంగ్రెస్ మిగతా..2లో

## ఆ పదవులు వేరే వాళ్లకు ఇవ్వండి! : కేటీఆర్‌కు మంత్రి పొన్నం సవాల్



బీఆర్ఎస్ అధ్యక్ష, వర్కింగ్ ప్రెసిడెంట్ పదవులు బీసీ, ఎస్సీ, ఎస్టీలకు ఇవ్వాలన్న మంత్రి

బీసీల గురించి మాట్లాడే అర్హత కేటీఆర్‌కు ఉందా? అని నిలదీత

సమగ్ర కుటుంబ సర్వే ప్రజలను ఇబ్బంది పెట్టేందుకు కాదన్న మంత్రి

## మేం మైనార్టీలకు రిజర్వేషన్లు ఇస్తే... మోదీ రద్దు చేయాలని ప్రయత్నిస్తున్నారు: రేవంత్ రెడ్డి



- మతవిద్వేషాలు రెచ్చగొట్టే వారిని ఓడించాలని సీఎం పిలుపు
- మెజార్టీ, మైనార్టీ ప్రజలు తమ ప్రభుత్వానికి రెండు కళ్లలాంటి వారన్న సీఎం
- దేశంలో ఉన్నవి మోదీ వర్గం... గాంధీ వర్గమని వ్యాఖ్య

# కేసీఆర్ ని కాపీ కొడుతున్న జగన్!

- గజ్వేల్ ఎమ్మెల్యేగా అయినా కేసీఆర్ ఎంట్రీ అసెంబ్లీలో ఉండాలి కదా అనేది ఇక్కడ కీలకాంశం!
- తెలంగాణలో వరుసగా రెండుసార్లు సీఎంగా ఉన్న కేసీఆర్
- ఇప్పటివరకూ ప్రతిపక్ష నేతగా కేసీఆర్ తెలంగాణ అసెంబ్లీలో అడుగుపెట్టలేదు
- ప్రజా సమస్యలపై బలంగా ప్రశ్నిస్తామని భయపడే ఆ హోదా ఇవ్వడం లేదని జగన్
- తెలంగాణలోనూ, ఇటు ఏపీలో రెండు విచిత్రమైన పరిస్థితులు నెలకొన్నారు



రెండు తెలుగు రాష్ట్ర రాజకీయాల్లోనూ ఇప్పుడు ఓ కామన్ విషయం స్పష్టంగా కనిపిస్తోంది. ఇందులో భాగంగా... రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ప్రతిపక్ష నేతలు ప్రజాసమస్యలపై చర్చించేందుకు అసెంబ్లీకి హారజుకావడం లేదు. మిగతా..2లో

## తొలిసారి ఆ గ్రామంలో ఎన్నికల పండుగ

నాందేడ్: మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లు దాటినా కొన్ని ప్రాంతాల్లో ఇంకా వెనుకబాటుతనం కనిపిస్తుంది. ఈ కోవలోకే వస్తుంది మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా కిన్వాట్ తాలూకాలోని వాగ్దారి గ్రామం. ఈ గ్రామంలో 300 జనాభా ఉంది. భూ రెవెన్యూ మ్యాప్‌లో ఈ గ్రామం పేరు కూడా లేకపోవడంతో ఇన్నాళ్లూ ఈ గ్రామానికి చెందిన వారు తమ గ్రామంలో ఓటు వేయలేకపోయారు. తాజాగా ఈ సమస్యకు పరిష్కారం దొరికింది. దీంతో గ్రామంలో పోలింగ్ బూత్ ఏర్పాటు కానుంది. నవంబర్ 20న జరగనున్న మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఈ ?గ్రామ ప్రజలు తొలిసారిగా తమ గ్రామంలో ఓటు వేయనున్నారు. ఇప్పటి వరకు ఈ గ్రామంలోని ఓటర్లు సమీపంలోని పోలింగ్ కేంద్రమైన జలధారకు వెళ్లేవారు. వీరు ఇక్కడికి చేరుకోవడానికి రెండు గంటల సమయం పట్టేది. అయితే అడవి గుండా వెళ్లాల్సిన రావడంతో క్రూర మృగాల భయం వారిని వెంటాడేది. తాజాగా కిన్వాట్ నియోజకవర్గం పరిధిలోని వాగ్దారీలో పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంది. దీంతో ఈ గ్రామంలోని 190 మంది ఓటర్లు స్థానికంగానే ఓటు వేయనున్నారు. గ్రామానికి పోలింగ్ బూత్ రావడంతో త్వరలో ఇక్కడ మౌలిక సదుపాయాలు ఏర్పడతాయని గ్రామస్తులు భావిస్తున్నారు. ఈ ప్రాంతంలోని చారిత్రక సరిహద్దులను దృష్టిలో ఉంచుకుని గ్రామంలోని భూమికి కొలతలు నిర్వహించి, పూణేలోని అధికారులకు ప్రతిపాదనలు పంపినట్లు స్థానిక అధికారులు తెలిపారు. దీంతో రాబోయే కొద్ది నెలల్లో గ్రామస్తులకు భూమి యాజమాన్యపు రుజువు లభిస్తుందని భావిస్తున్నారు. ఎన్నికల సంఘం ఏర్పాటు చేసిన ఈ పోలింగ్ కేంద్రం గ్రామస్తుల్లో కొత్త ఆశను నింపింది. ఎన్నికల్లో తమ గళం వినిపించాలని, అప్పుడే ప్రభుత్వం తమ కనీస అవసరాలను తీరుస్తుందని గ్రామస్తులు అంటున్నారు.

## లెబనాన్‌లో సమాధుల కింద హిజ్బుల్లా భారీ సొరంగం.. గుర్తించిన ఇజ్రాయెల్..

న్యూఢిల్లీ : లెబనాన్‌లో సమాధుల కింద ఉగ్రవాద సంస్థ హిజ్బుల్లా నిర్మించిన భారీ సొరంగాన్ని ఇజ్రాయెల్ ఆర్మీ (ఐడీఎఫ్) గుర్తించింది. ఇందుకు సంబంధించిన వీడియోను విడుదల చేసింది. కిలోమీటర్‌కు పైగా పొడవున్న ఈ సొరంగం సరిహద్దు నుంచి 1.5 కిలోమీటర్ల దూరంలో ఉంది. సొరంగ నిర్మాణం కోసం దాదాపు 4,500 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్‌ను ఉపయోగించి ఉంటారని ఐడీఎఫ్ అంచనా వేసింది. ఈ వీడియోను షేర్ చేసిన ఇజ్రాయెల్ ఆర్మీ.. ఇలాంటి ఎన్నో టన్నెళ్లను ధ్వంసం చేసినట్టు పేర్కొంది. ఈ సొరంగంలో కమాండ్ కంట్రోల్ రూములు, తుపాకులు, రాకెట్ లాంచర్లు, స్లీపింగ్ క్వార్టర్లు, డజన్ల కొద్దీ ఆయుధాలు, ఇతర సామగ్రి ఉన్నట్టు తెలిపింది. దక్షిణ లెబనాన్‌లోని గ్రామాల్లో హిజ్బుల్లా ఇలాంటి సొరంగాలను నిర్మించినట్టు వివరించింది. మరోవైపు, లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతున్నాయి. ఇజ్రాయెల్ జరుపుతున్న దాడుల్లో గతేడాది అక్టోబర్ నుంచి ఇప్పటి వరకు 3,186 మంది ప్రాణాలు కోల్పోయారు. 14,078 మంది గాయపడ్డారు. శనివారం ఒక్క రోజే 53 మంది మరణించారు.

## అయోధ్య రామ మందిరం పునాదుల్ని పెకిలిస్తాం.. ఖలిస్థానీ ఉగ్రవాది పన్నూన్ బెదిరింపులు

మొదటి పేజి తరువాయి

ఈ మేరకు ఓ వీడియో రిలీజ్ చేశారు. 'హింసాత్మక హిందుత్వ భావజాలానికి పుట్టినిల్లు అయిన అయోధ్య పునాదులను పెకిలిస్తాం' అంటూ హెచ్చరించారు. ఈ వీడియోలో రామ మందిరం ప్రారంభోత్సవం సందర్భంగా అక్కడ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రార్థనలు చేస్తున్న దృశ్యాలను ప్రదర్శించారు. మరోవైపు హిందూ దేవాలయాలపై ఖలిస్తాన్ దాడులకు దూరంగా ఉండాలని కెనడాలోని భారతీయులను కూడా పన్నూన్ హెచ్చరించాడు.కాగా, పన్నూన్ ఇలా బెదిరింపులకు పాల్పడటం ఇదేమీ మొదటిసారి కాదు. గతంలోనూ అనేక సార్లు ఇలాంటి హెచ్చరికలే చేశారు. నవంబర్ 1వ తేదీ నుంచి 19వ తేదీ వరకూ ఎయిర్ ఇండియా విమానాల్లో ప్రయాణించొద్దంటూ గత నెలలో వార్నింగ్ ఇచ్చాడు. భారత్‌లో సిక్కు వ్యతిరేక అల్లర్లు జరిగి 40 ఏళ్లు కావొస్తున్న సందర్భంగా ఎయిర్ ఇండియా విమానాలపై దాడి జరిగే అవకాశం ఉందని పేర్కొన్నాడు.గతేడాది కూడా నవంబర్ నెలలోనే ఇలాంటి బెదిరింపులే చేశాడు. నవంబర్ 19న ఎయిర్ ఇండియా విమానాల్లో సిక్కులు ప్రయాణించొద్దని సూచించాడు. లేని పక్షంలో మీ ప్రాణాలకు ముప్పు ఉంటుందని హెచ్చరించాడు. నవంబర్ 19న ఢిల్లీలోని ఇందిరా గాంధీ ఇంటర్నేషనల్ విమానాశ్రయం మూసివేస్తారని పన్నూన్ తెలిపాడు. భవిష్యత్తులో ఆ విమానాశ్రయం పేరు కూడా మారుతుందని అన్నాడు. ఇప్పుడు రామ మందిరం పునాదుల్ని పెకిలిస్తాం అని బెదిరింపులు రావడం కలకలం రేపుతోంది.

## మూసీ ప్రాంతంలో మైనార్టీల ఇళ్లను కాంగ్రెస్ ప్రభుత్వం కూల్చేస్తోంది: కేటీఆర్

హైదరాబాద్ : మూసీ పరీవాహక ప్రాంతంలో కాంగ్రెస్ ప్రభుత్వం మైనార్టీల ఇళ్లను కూలుస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ... హిందూ, ముస్లిం సహృద్భావనలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. కేసీఆర్ హయాంలో రాష్ట్రంలో గంగాజమున తెహజీబ్ పాలన సాగిందని తెలిపారు. ఒకరినొకరు గౌరవించుకునే, సంస్కరించుకునే మంచి వాతావరణం ఉండేదన్నారు. గురుకులాలు ఏర్పాటు చేసి మైనార్టీ పిల్లల దశను మార్చామన్నారు. మైనార్టీ విద్యార్థులను ప్రపంచంతో పోటీపడేలా తీర్చిదిద్దినట్లు చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో 2,751 మంది విద్యార్థులకు రూ.20 లక్షల చొప్పున స్కాలర్‌షిప్ లు ఇచ్చామన్నారు. నాంపల్లిలోని అనాథ శరణాలయానికి రూ.200 కోట్ల విలువ చేసే 2 ఎకరాల భూమి ఇచ్చామని తెలిపారు. మైనార్టీల కోసం ఆధునిక భవనాలు నిర్మించి ఇచ్చామన్నారు. మైనార్టీల సంక్షేమానికి రూ.10 వేల కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు. దేశంలోనే ఎక్కడా లేనివిధంగా షాదీ ముబారక్ పథకంతో పేదింటి ఆడపిల్లల పెళ్లికి సాయం చేశామన్నారు. ఇమాం, మౌజంలకు నెలకు రూ.5 వేల వేతనం ఇచ్చామని గుర్తు చేశారు. పదవుల్లోనూ మైనార్టీలకు తాము ప్రాధాన్యతను ఇచ్చామని తెలిపారు. మహమూద్ అలీనీ తొలి ఉపముఖ్యమంత్రిగా చేశామని చెప్పారు. వరంగల్‌కు... తొలిసారి ముస్లింకు డిప్యూటీ మేయర్ పదవిని ఇచ్చామని గుర్తు చేశారు. కానీ కాంగ్రెస్ పార్టీ మొహబ్బత్ కీ దుకాన్ అంటూ మైనార్టీలపై విరుచుకుపడుతోందన్నారు. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పి మోసం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ సీఎం మహమూద్ అలీ పాల్గొన్నారు.

## ఏపీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై బడ్జెట్ ప్రసంగంలో మంత్రి ఏమన్నారంటే..?

అమరావతి : మహిళలు సాధించిన పురోగతి స్థాయిని బట్టి సమాజ పురోగతిని కొలుస్తానన్న అంబేద్కర్ మాటలను అనుసరించి ముఖ్యమంత్రి చంద్రబాబు మహిళా సాధికారతపై దృష్టి సారించారని మంత్రి పయ్యావల కేశవ్ పేర్కొన్నారు. సోమవారం అసెంబ్లీలో వార్షిక బడ్జెట్ ను ప్రవేశపెట్టిన మంత్రి, వివిధ శాఖల కేటాయింపులపై ప్రసంగించారు. రాష్ట్రంలో మహిళా సంక్షేమం, అభివృద్ధి, భద్రతకు తమ ప్రభుత్వం ప్రాధాన్యమిస్తుందని చెప్పారు. మహిళా శిశు సంక్షేమ శాఖకు ఈ ఏడాది బడ్జెట్ లో రూ.4,285 కోట్లను కేటాయించినట్లు తెలిపారు. తల్లికి వందనం పథకానికి నిధులు కేటాయిస్తామని మంత్రి చెప్పారు. పేదరికం కారణంగా రాష్ట్రంలో ఏ ఒక్క విద్యార్థి కూడా చదువుకు దూరం కాకూడదనేదే తమ ప్రభుత్వ ఉద్దేశమని చెప్పారు. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 1 నుంచి 12వ తరగతి చదువుతున్న విద్యార్థుల తల్లులకు ఆర్థిక సాయం అందజేస్తామని చెప్పారు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా త్వరలోనే రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం ప్రారంభిస్తామని మంత్రి వివరించారు. అదేవిధంగా, దీపం - 2 పథకం ద్వారా గృహిణులకు ఏటా మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నామని గుర్తుచేశారు. ఈ పథకం కింద ఇప్పటికే 5 లక్షల మంది గృహిణులు లబ్ది పొందుతున్నారని అసెంబ్లీలో మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు.

## మోదీ ఆ ఆరోపణలు నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా.. సిద్ధరామయ్య సవాల్




కర్ణాటక ఎక్సైజ్ శాఖలో రూ. 700 కోట్ల కుంభకోణం జరిగినట్టు ఆరోపించిన ప్రధాని నరేంద్రమోదీ.. ఆ ఆరోపణలను నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానని ముఖ్యమంత్రి సిద్దరామయ్య సవాల్ విసిరారు. నిరూపించలేకపోతే మోదీ రాజకీయాల నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేశారు. రెండ్రోజుల క్రితం మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో మోదీ మాట్లాడుతూ కర్ణాటక ఎక్సైజ్ శాఖలో భారీ కుంభకోణం జరిగిందని, ఆ సొమ్మును మహారాష్ట్ర, ఝార?ండ్‌లో ఎన్నికల ప్రచారానికి కాంగ్రెస్ వాడుకుంటోందని ఆరోపించారు. కర్ణాటక వైన్ మర్చెంట్స్ అసోసియేషన్ ఇటీవల ఎక్సైజ్ విభాగంపై తీవ్ర ఆరోపణలు చేసింది. మరీ ముఖ్యంగా మంత్రి తిమ్మాపూర్‌ను లక్ష్యంగా చేసుకుంది. లైసెన్సులు మంజూరు చేసేందుకు, ట్రాన్స్‌ఫర్ల కోసం రూ. 30 లక్షల నుంచి రూ. 70 లక్షలు వసూలు చేస్తున్నట్టు ఆరోపించింది. గత ఏడాది కాలంలో ఇలా 1000 లైసెన్సులను అక్రమంగా కేటాయించారని, ఫలితంగా రూ. 300-700 కోట్ల కుంభకోణం జరిగిందని ఆరోపించింది. మోదీ ఆరోపణలను ఖండించిన సీఎం సిద్దరామయ్య నిధుల దుర్వినియోగం జరగలేదని స్పష్టం చేశారు. దేశానికి ప్రధాని అయి ఉండీ మోదీ ఇన్ని అబద్ధాలు ఆడతారని అనుకోలేదని, ఆయన ఆరోపణలు తనను ఆశ్చర్యానికి గురిచేశాయని పేర్కొన్నారు. మోదీ తన ఆరోపణలను నిరూపిస్తే తాను రాజకీయాల నుంచి వైదొలగుతానని, లేదంటే ఆయన రాజకీయాలకు రిటైర్మెంట్ ప్రకటించాలని సవాలు విసిరారు. ప్రధాని చేసే ఆరోపణలు వాస్తవానికి కాస్తయినా దగ్గరగా ఉండాలని, కానీ మోదీ ఆరోపణలు వాస్తవానికి చాలా దూరంగా ఉన్నాయని పేర్కొన్నారు. స్వతంత్ర భారతదేశంలో ఇంతగా అబద్ధాలు చెప్పే వ్యక్తిని ఇప్పటి వరకు చూడలేదని సిద్దరామయ్య ఎద్దేవా చేశారు.

# బాబు మార్క్ బడ్జెట్... రెండూ చూసుకుంటూ !

మొదటి పేజి తరువాయి

బాబు ప్రభుత్వం 2019లో మార్చిలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ని సమర్పించి దిగిపోయింది. / ఇక 2024లో మళ్లీ నెగ్గిన చంద్రబాబు కూటమి మిత్రులతో కలుపుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. అయితే జూన్ 12న ప్రమాణం చేసిన కూటమి ప్రభుత్వం గడచిన అయిదు నెలలుగా బడ్జెట్ ని ప్రవేశపెట్టలేదు. అదే సమయంలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్ నే మరోసారి ప్రవేశ పెట్టింది. అలా కొత్త ప్రభుత్వం వస్తూనే ఓటాన్ అకౌంట్ వైపుగా వెళ్లడం ఒక విశేషంగానే చెప్పుకున్నారు. దాని మీద వైసీపీ రాజకీయ విమర్శలు చేసింది. బడ్జెట్ ని కూడా పూర్తిగా ప్రవేశపెట్టలేని కూటమి సర్కార్ అని నిందించారు. ఇక అటూ ఇటూ మాటలు ఎన్ని అనుకున్నా కూటమి ప్రభుత్వాన్ని నడుపుతున్న చంద్రబాబు మాత్రం ఏ విధంగానూ తొందర పడలేదు. ఆయన అన్నీ అనుకున్నట్లుగానే చేసుకుని వెళ్లారు ఇపుడు తగిన సమయం వచ్చిందని ఆయన పూర్తి బడ్జెట్ ని ప్రవేశపెడుతున్నారు. ఈసారి ప్రవేశపెట్టే బడ్జెట్ డిసెంబర్ జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలకు సంబంధించి ఉంటుంది. అంటే నాలుగు నెలలకు మాత్రమే. పూర్తి వార్షిక బడ్జెట్ అంటే మూడు లక్షల దాకా బడ్జెట్ అంచనా ఉంటుందని చెబుతున్నారు. అందులో మూడవ వంతు కాబట్టి లక్ష కోట్లతో బడ్జెట్ ఉండొచ్చు అని అంటున్నారు. అది 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉండొచ్చు అని అంటున్నారు. ఆ విధంగా చూస్తే కనుక ఈ బడ్జెట్ ని ఫుల్ మీల్స్ గానే తీసుకుని రాబోతున్నారు అని అంటున్నారు. ఇక అమరావతి పోలవరం వంటి వాటి విషయంలో పూర్తి వివరాలు చెబుతూ ఎపుడు పూర్తి చేస్తామో కూడా ఈ బడ్జెట్ ద్వారా చెప్పబోతున్నారు అని అంటున్నారు బడ్జెట్ ప్రవేశపెట్టే వేళకు పోలవరానికి ప్రపంచ బ్యాంక్ ఆసియన్ బ్యాంక్ నిధులు కూడా దక్కబోతునాయి. దాంతో అమరావతి రాజధానిని ఎన్ని వేల కోట్లతో నిర్మాణం చేపట్టబోతున్నామని చెబుతారు. అలాగే ఎన్ని దశలలో పూర్తి చేస్తామని కూడా వివరించే ప్రయత్నం ఉంటుంది అని అంటున్నారు. దానికి అయ్యే ఖర్చుని వివరిస్తూనే ఏ విధంగా నిధుల సమీకరణ ఉంటుంది, కేటాయింపులు ప్రభుత్వం తరపున లేదా ఫైనాన్షియల్ ఏజెన్సీల నుంచి వస్తుంది అన్నది కూడా వివరిస్తారని అంటున్నారు. మొత్తానికి చూస్తే అమరావతి రాజధాని పేరుతో ఏపీలో అతి పెద్ద అభివృద్ధికి కూటమి ప్రభుత్వం నాంది పలుకుతోంది అన్నది కచ్చితంగా చెప్పనున్నారు. ఇది బడ్జెట్ లో టాప్ ప్రయారిటీగా హైలెట్ గా ఉండబోతోంది. మరో వైపు




చూస్తే పోలవరం ప్రాజెక్ట్ ఏపీకి జీవనాడి లాంటిది. దానికి కూడా కేంద్రం ఇటీవలనే 12 వేల కోట్ల రూపాయల దాకా బ్యాక్ లాగ్ నిధులను విడుదల చేసింది. దాంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం తరపున బడ్జెట్ నుంచి ఏటా కనీసం రెండు వేల కోట్లకు తక్కువ కాకుండా కేటాయింపులు చేస్తూ ఒక నిర్దిష్ట కాల పరిమితిలో పూర్తి చేస్తామని కూడా చెప్పబోతున్నారు అంటున్నారు. ఇక మిగిలిన అభివృద్ధి కార్యక్రమాలతో ఫ్యూచర్ ప్లాన్స్ తో బడ్జెట్ లో చాలా విషయాలే ఉండబోతున్నాయని తెలుస్తోంది. అలాగే సంక్షేమానికి కూడా బడ్జెట్ లో పెద్ద పీట వేయబోతున్నారు ఇప్పటికే సూపర్ సిక్స్ లో రెండు హామీలను నెరవేర్చిన ప్రభుత్వం మిగిలిన వాటి గురించి కచ్చితంగా చెబుతుందని అంటున్నారు. అలాగే వాటికి నిధులను ఏ మేరకు కేటాయిస్తుందో ఒక అంచనా కూడా ఈ బడ్జెట్ ద్వారా తెలుసుకోవచ్చు. ఇక ఏపీలో ఉన్న అప్పులను కూడా వివరించే ప్రయత్నం బడ్జెట్ ద్వారా చేస్తారని లో ఉన్న అప్పులను కూడా వివరించే ప్రయత్నం బడ్జెట్ ద్వారా చేస్తావాటికి కడుతున్న వడ్డీలు ఎంత మేరకు ఉన్నాయో ఏపీలోని పౌరులకు తెలియచేస్తారు అని అంటున్నారు. మొత్తానికి ఈ బడ్జెట్ ద్వారా కూటమి ప్రభుత్వం అటు అభివృద్ధి ఇటు సంక్షేమం రెండింటినీ బ్యాలెన్స్ చేసేలాగానే చూస్తుందని అంటున్నారు.

## మూసీ వివాదంపై బీఆర్ఎస్‌కు చెక్ పెట్టేందుకు సీఎం రేవంత్ కొత్త స్కెచ్..సెంటిమెంటును పండిస్తున్నారా..?


మొదటి పేజి తరువాయి

ప్రభుత్వం దూకుడు పెంచింది. నల్లగొండ సెంటిమెంట్ ను పండించి.. బీఆర్ఎస్ కు చెక్ పెట్టేందుకు కాంగ్రెస్ ప్రయత్నం చేస్తోందన్న టాక్ వినిపిస్తోంది. వ్యూహాత్మకంగానే సీఎం రేవంత్ తన బర్త్ డే రోజున మూసీ పునర్జీవ సంకల్ప పాదయాత్ర చేశారు. కాంగ్రెస్ నల్లగొండ సెంటిమెంటుకు దీటుగా బీఆర్ఎస్ మూసి ఎజెండాను సిద్ధం చేస్తోంది. మూసీ పాపం కాంగ్రెస్ దే అంటూ ప్రజల్లోకి వెళ్లేందుకు బీఆర్ఎస్ ప్లాన్ చేస్తుంది. నల్లగొండ సెంట్రిక్ గా మూసీ పునర్జీవనం కాంగ్రెస్ బీఆర్ఎస్ ల మధ్య పొలిటికల్ వార్ గా మారింది. మూసీ పునర్జీవనంపై కాంగ్రెస్ ప్రతిపక్ష బీఆర్ఎస్ ల మధ్య రాజకీయ మంటలు చెలరేగుతూనే ఉన్నాయి. సీఎం రేవంత్ పాల్గొన్న మూసి పునర్జీవ సంకల్ప యాత్రతో రాష్ట్రంలో పొలిటికల్ హీట్ పెరిగింది. మూసీ పునర్జీవ సంకల్ప యాత్ర పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం దూకుడు పెంచింది. మూసి ప్రక్షాళన చేసి తీరుతామని అధికార కాంగ్రెస్, అడ్డుకుంటామని బీఆర్ఎస్ ప్రకటించడంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ ల రాజకీయ యుద్ధం మొదలైంది. హైదరాబాద్ కేంద్రంగా సీఎం రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని బీఆర్ఎస్, బీజేపీ అగ్ర నేతలు విమర్శల దాడి చేస్తున్నారు. రేవంత్ సర్కార్ చేపట్టిన మూసీ పునర్జీవనంపై ప్రతిపక్ష పార్టీలు విమర్శలు ఎక్కుపెట్టడంతో మూసీ ప్రకంపనలు.. ఇపుడు ఉమ్మడి నల్గొండ జిల్లాకు తాకాయి. మూసీనది ప్రక్షాళన, పునర్జీవనంపై కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మధ్య పేలుతున్న మాటల తూటాలతో జిల్లాలో రాజకీయం మరింత వేడెక్కింది.

నల్లగొండ సెంటిమెంట్‌తో రాజకీయం..

రాష్ట్రంలో పొలిటికల్ వార్ గా మారిన మూసీ పునర్జీవనాన్ని సీఎం రేవంత్ రెడ్డి ఛాలెంజ్ గా తీసుకున్నారు. తన జన్మదినం రోజున మూసీ పరివాహక ప్రాంతాన్ని పరిశీలించి మూసీ పునర్జీవ సంకల్ప పాదయాత్రలో పాల్గొన్నారు. దీంతో మూసీ రాజకీయాలు నల్గొండ సెంట్రిక్ గా మారాయి. మూసీ ప్రక్షాళనే తప్పు అన్నట్టుగా బీఆర్ఎస్ నేతలు చేస్తున్న విమర్శలను సీఎం రేవంత్ తిప్పి కొట్టారు. జనవరి తొలివారం నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వాడపల్లి నుంచి పాదయాత్ర చేస్తానని రేవంత్ ప్రకటించారు. దీంతో మూసీ వివాదంపై బీఆర్ఎస్ కు చెక్ పెట్టేందుకు.. సీఎం రేవంత్.. నల్లగొండ సెంటిమెంటును పండిస్తున్నారట. మూసీ కాలుష్య మురుగు నీటితో అష్టకష్టాలు పడుతున్న ఉమ్మడి నల్గొండ జిల్లా ప్రజల బాధలు తెలుసుకునేందుకు నేరుగా రంగంలోకి దిగారట. మూసి ప్రక్షాళనను వ్యతిరేకిస్తే అది నల్లగొండ ప్రజల్ని వ్యతిరేకించినట్లేనన్న సెంటిమెంటును తీసుకు వచ్చేందుకు కాంగ్రెస్ వ్యూహాత్మకంగా ప్రయత్నిస్తోందట. మూసిని రాజకీయ అంశం చేసి సెంటిమెంట్రే రేపితే బీఆర్ఎస్ ను ఇరకాటంలో పడేయొచ్చని కాంగ్రెస్ ప్లానట. అందుకే కాంగ్రెస్ పార్టీ నల్లగొండ జిల్లాపై మూసీ అస్త్రం ప్రయోగిస్తోందట.

మూసీ పాపం ఎవరిది..?




కాంగ్రెస్ సర్కారు ప్రయోగిస్తున్న మూసి అస్త్రాన్ని.. బీఆర్ఎస్ [illegible] తిప్పికొడుతున్నారు. తాము మూసీ ప్రక్షాళనకు వ్యతిరేకం కాదని.. దానిలోని దోపిడీకే వ్యతిరేకమని బీఆర్ఎస్.. రేవంత్ సర్కార్ పై విమర్శ దాడి కొనసాగిస్తోంది. అందుకే మూసి విషయంలో బీఆర్ఎస్ రాజకీయాన్ని కాంగ్రెస్ నల్లగొండ సెంటిమెంట్ తో ఎదుర్కొంటోందట. దీనికి దీటుగా బీఆర్ఎస్ కూడా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కార్యాచరణను రూపొందిస్తోందట. సీఎం రేవంత్ పర్యటన రోజున ఉమ్మడి జిల్లాలో బీఆర్ఎస్ నేతల అరెస్టులు, ప్రభుత్వ దమన కాండను ప్రజలకు చెప్పాలని బీఆర్ఎస్ భావిస్తుందట. మూసి పాపం కాంగ్రెస్ దే అంటూ.. మూసి పరివాహక ప్రాంత ప్రజలను చైతన్య వంతులను చేసేందుకు బీఆర్ఎస్ దండయాత్రకు సిద్ధమవుతోందట. ఉమ్మడి నల్గొండ నుండి మూసి పునర్జీవనంపై పోరును మరింత ఉధృతం చేయాలని బీఆర్ఎస్ ప్లాన్ చేస్తోందట. బీఆర్ఎస్ అగ్ర నేతలు కేటిఆర్, హరీష్ రావులతో మూసి ఎజెండాగా జిల్లాలో పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపట్టాలని నేతల భావిస్తున్నారట.మూసీ పునర్జీవన రాజకీయంపై కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మాటల తూటాలతో రాజకీయం మరింత వేడెక్కింది. నల్లగొండ సెంట్రిక్ గా ఉన్న మూసి పాలిటిక్స్ ఎటు దారి తీస్తాయో చూడాలి..!

## ఆ పదవులు వేరే వాళ్లకు ఇవ్వండి! : కేటీఆర్‌కు మంత్రి పొన్నం సవాల్

హైదరాబాద్ : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కేటీఆర్‌కు దమ్ముంటే బీఆర్ఎస్ పార్టీ అధ్యక్ష పదవిని, వర్కింగ్ ప్రెసిడెంట్ పదవిని, సభలో ప్రతిపక్ష పదవిని బీసీ, ఎస్సీ, ఎస్టీలకు ఇవ్వాలని సవాల్ చేశారు. కార్తీక సోమవారం సందర్భంగా ఆయన వేములవాడలో శ్రీ రాజరాజేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ... అసలు బీసీల గురించి మాట్లాడే అర్హత కేటీఆర్‌కు ఉందా? అని ప్రశ్నించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు అన్యాయం చేసిన పార్టీ బీఆర్ఎస్ అని దుయ్యబట్టారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతోన్న సమగ్ర కుటుంబ సర్వే ప్రజలను ఇబ్బంది పెట్టేందుకు కాదని స్పష్టం చేశారు.సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో జరుగుతున్న కుల సర్వే దేశవ్యాప్తంగా జరగాలని ఈ సందర్భంగా మంత్రి డిమాండ్ చేశారు. బీజేపీ, బీఆర్ఎస్‌లు సర్వేపై అప్రతిష్ఠపాలు చేయాలని చూస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాబట్టి రెచ్చగొట్టే రాజకీయ పార్టీల నాయకుల వ్యాఖ్యలకు ప్రభావితం కావొద్దని ప్రజలకు పిలుపునిచ్చారు.

## కేసీఆర్ ని కాపీ కొడుతున్న జగన్!

మొదటి పేజి తరువాయి



ఈ విషయంలో.. తమ తమ గైర్హాజరీలపై ఎవరి వెర్షన్ వారు చెబుతున్నప్పటికీ.. వాటిని ప్రజలు ఏ రీతిగా పరిగణలోకి తీసుకుంటారనేది ఆసక్తిగా మారింది. / సాధారణంగా అధికార పక్షం మరీ ఇబ్బందులు పెడుతుంటేనో.. లేక, మరో కారణంతోనో చాలా మంది ప్రతిపక్ష నేతలు ఛాలెంజ్ ల పేరు చెప్పి అసెంబ్లీ సమావేశాలకు గైర్హాజరవుతుంటారు. ఈ మేరకు చరిత్రలో ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి! అనంతరం ప్రజల్లోకి వెళ్లి, ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలను, నియంతృత్వ వైఖరిని ఇలా చేసి, తిరిగి అసెంబ్లీలో ముఖ్యమంత్రులుగా హాజరైన వారూ ఉన్నారు. 2019 ఎన్నికల అనంతరం ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబు ఛాలెంజ్ చేసి బయటకు వెళ్లారు. ఇప్పుడు బంపర్ మెజారిటీతో సభలో సీఎంగా అడుగుపెట్టారు! అయితే... ఇప్పుడు అటు తెలంగాణలోనూ, ఇటు ఏపీలో రెండు విచిత్రమైన పరిస్థితులు నెలకొన్నాయని అంటున్నారు. వాస్తవానికి తెలంగాణలో వరుసగా రెండుసార్లు సీఎంగా ఉన్న కేసీఆర్... కాంగ్రెస్ ప్రభుత్వ కొలువుదీరిన తర్వాత అసెంబ్లీ సమావేశాలకు గైర్హాజరవుతున్నారు. తొలి శాసనసభ సమావేశాల సమయంలో తుంటికి గాయం కారణంగా ఆస్పత్రిలో చేరిన ఆయన.. సభకు హాజరుకాలేదు. తర్వాత ఆరోగ్యం కాస్త కుదుటపడ్డాక ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేశారు. దీంతో... ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన బడ్జెట్ సమావేశాలకు కేసీఆర్ హాజరవుతారని అంతా భావించారు! ఆ సమావేశాల తొలిరోజు కేసీఆర్ కనిపించలేదు. అమావాస్య కదా అందుకే ఆగి ఉంటారు.. రెండో రోజు కచ్చితంగా వస్తారు అని అనుకున్నారు. అయినా కనిపించలేదు. అలా... ఇప్పటివరకూ ప్రతిపక్ష నేతగా కేసీఆర్ తెలంగాణ అసెంబ్లీలో అడుగుపెట్టలేదు. ఈ విషయంపై... కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు కేసీఆర్ అవసరం లేదని, తాము చాలని కేటీఆర్, హరీష్ రావులు చెబుతున్నారు. అయితే... గజ్వేల్ ఎమ్మెల్యేగా అయినా కేసీఆర్ ఎంట్రీ అసెంబ్లీలో ఉండాలి కదా అనేది ఇక్కడ కీలకాంశం! మరి ఈ గైర్హాజరీని ప్రజలు ఎలా రిసీవ్ చేసుకుంటారనేది చూడాలి. ఇక ఏపీ విషయానికొస్తే.. అక్కడ మరో రకం సమస్య ఉంది. ఏపీ అసెంబ్లీలో తాము తప్ప మరో పార్టీ లేదు.. అక్కడ ఉన్నదంతా అధికార పక్షమే కాబట్టి.. తమకు ప్రతిపక్ష హోదా ఎందుకు ఇవ్వడం లేదు.. ఇస్తే సీఎం మాట్లాడిన తర్వాత తమకు అంతే సమయం మైక్ ఇవ్వాల్సి వస్తుందని.. అదే జరిగితే ప్రజా సమస్యలపై బలంగా ప్రశ్నిస్తామని భయపడే ఆ హోదా ఇవ్వడం లేదని జగన్ అంటున్నారు. ఈ కారణం చెప్పి... ఆయన, ఆయనతో పాటు మిగిలిన 10 మంది వైసీపీ సభ్యులు ఏపీ అసెంబ్లీ సమావేశాలకు గైర్హాజరవుతున్నారు. అసెంబ్లీలో జరిగే చర్చాలపై మీడియాలో స్పందిస్తానని, తమకు ఏదో ఒక సమయం కేటాయించాలని, తమకు జర్నలిస్టులే స్పీకర్ అని చెప్పుకొస్తున్నారు. దీంతో... ప్రతిపక్ష నేత తర్వాత.. ముందు పులివెందుల ఎమ్మెల్యే అనే విషయం మరిచిపోతే ఎలా అని అధికార పార్టీ కౌంటర్స్ వేస్తోంది! ఇలా పరిస్థితులు ఏవైనా.. కారణాలు మరేవైనా.. వాటిని ప్రైపక్ష నేతల సాకులని అధికారపార్టీ అంటున్నా.. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ (ప్రధాన) ప్రతిపక్ష పార్టీల నేతలు కేసీఆర్, జగన్ లు శానసభ సమావేవుతుశాలకు గైర్హాజరనే ఉన్నారు. ఈ విషయంలో కేసీఆర్ ను జగన్ ఫాలో అవుతున్నారనుకోవాలా.. లేక, పరిస్థితులు అలా వచ్చాయనుకోవాలో తెలియదు కానీ... దీన్ని ప్రజలు ఎలా తీసుకుంటారనేదే ఇక్కడ కీలకం అని అంటున్నారు పరిశీలకులు.

## మేం మైనార్టీలకు రిజర్వేషన్లు ఇస్తే... మోదీ రద్దు చేయాలని ప్రయత్నిస్తున్నారు: రేవంత్ రెడ్డి

హైదరాబాద్ : కాంగ్రెస్ పార్టీ మైనార్టీలకు నాలుగు శాతం రిజర్వేషన్లు ఇచ్చిందని... కానీ వాటిని రద్దు చేసేందుకు ప్రధాని నరేంద్ర మోదీ ప్రయత్నిస్తున్నారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. మతవిద్వేషాలు రెచ్చగొట్టేవారిని ఓడించాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... మెజార్టీ, మైనార్టీ ప్రజలు తమ ప్రభుత్వానికి రెండు కళ్లలాంటి వారు అన్నారు. స్వాతంత్ర్యం రాగానే మౌలానా అబుల్ కలామ్ ఆజాద్‌ను విద్యాశాఖ మంత్రిగా చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమే అన్నారు. ఆయన విద్యా వ్యవస్థలో ఎన్నో విధానాలు తీసుకువచ్చారన్నారు. మైనార్టీ సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అహర్నిశలు పని చేస్తోందన్నారు. తమ ప్రభుత్వంలో మైనార్టీలకు ప్రాధాన్యత ఇచ్చామన్నారు. నాలుగు ఎమ్మెల్సీల్లో ఒకటి మైనార్టీలకు ఇచ్చామన్నారు. దేశంలో ఉన్నవి రెండే వర్గాలు అని... ఒకటి మోదీ వర్గం కాగా, రెండోది గాంధీ వర్గం అన్నారు. హిందూ, ముస్లిం భాయి భాయి అన్నదే తమ విధానమన్నారు. చార్మినార్ వద్ద గతంలో రాజీవ్ గాంధీ సద్భావన యాత్ర చేశారని, అదే చార్మినార్ వద్ద రాహుల్ గాంధీ కూడా యాత్ర చేశారని తెలిపారు. ం

## అసెంబ్లీకి వెళ్లే దమ్ము, ధైర్యం లేకపోతే రాజీనామా చేయండి: జగన్ పై షర్మిల విసుర్లు

మొదటి పేజి తరువాయి



షర్మిల తీవ్రస్థాయిలో స్పందించారు. జగన్ తీరు చూస్తుంటే అత్త మీద కోపం దుత్త మీద చూపించి నట్టుందని ఘాటుగా విమర్శించారు. జనం మీకు ఓట్లేసి మిమ్మల్ని గెలిపించింది ఎందుకు? అసెంబ్లీ సమావేశాలు ఎగ్గొట్టడానికా? అంటూ మండిపడ్డారు. "ప్రజలు మీకు ఓట్లేసింది... అసెంబ్లీ మీద అలగడానికో, మైకు ఇస్తేనే సభకు పోతానని మారాం చేయడానికో కాదు! మిమ్మల్ని ఎమ్మెల్యేగా గెలిపించింది... ఇంట్లో కూర్చుని సొంత మైకుల్లో మాట్లాడేందుకు కాదు! మీ స్వయంకృతాపరాధమే మిమ్మల్ని ప్రతిపక్షానికి దూరం చేసింది. ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీలో అడుగుపెడతాననడం మీ అవివేకానికి, మీ అజ్ఞానానికి నిదర్శనం" అంటూ జగన్ ను దుయ్యబట్టారు. అసెంబ్లీ అనేది ప్రజాస్వామ్య దేవాలయం అని, ప్రజల పట్ల, ప్రజా సమస్యల పట్ల అధికార పక్షాన్ని నిలదీసేందుకు ప్రజలు ఇచ్చే గొప్ప అవకాశం అని షర్మిల వివరించారు. "కూటమి ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలకు దిక్కు లేదు. మేనిఫెస్టోలో చెప్పిన హామీలు అమలు కావడంలేదు. రాష్ట్రంలో మహిళలపై దాడులు ఆగడంలేదు. శాంతిభద్రతలకు విఘాతం కలుగుతోంది. ఇసుక మాఫియా రాజ్యమేలుతోంది. బెల్టు షాపుల దందా అరికట్టడంలేదు. ఐదు నెలలు గడుస్తున్నా ఒక్క ఉద్యోగం భర్తీ కాలేదు. ప్రభుత్వ వైఫల్యాలపై నిలదీసే అవకాశాన్ని ప్రజలు వైసీపీకి ఇస్తే , ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీకి వస్తామనడం సిగ్గుచేటు. 1994లో కాంగ్రెస్ పార్టీకి కేవలం 26 సీట్లే వచ్చాయి. అయినప్పటికీ విపక్ష హోదా కావాలని మారాం చేయలేదు. ఆ 26 మంది సభ్యులతోనే అసెంబ్లీలో ప్రజాపక్షంగా కాంగ్రెస్ నిలిచింది. అనేక సమస్యలపై నాడు టీడీపీ ప్రభుత్వానికి కాంగ్రెస్ పార్టీ చుక్కలు చూపించింది. ఇక కేంద్రంలో... 2014లో 44 సీట్లు... 2019లో 52 సీట్లే వచ్చినా కాంగ్రెస్ ప్రతిపక్ష హోదా అడగలేదు. హోదా లేకపోయినా రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే ప్రజల పక్షాన పోరాడారు. మోదీ నియంతృత్వాన్ని ప్రశ్నిస్తూ, దేశ ప్రజల గొంతుకలా కాంగ్రెస్ మారింది. ఇప్పటికైనా మీ పిచ్చితనాన్ని పక్కనబెట్టి అసెంబ్లీకి వెళ్లి, కూటమి ప్రభుత్వ వైఫల్యాలను, నిర్లక్ష్యాన్ని ఎండగట్టండి. ఒకవేళ అసెంబ్లీకి వెళ్లే దమ్ము, ధైర్యం మీకు లేకపోతే వైసీపీ శాసనసభాపక్షం మొత్త రాజీనామా చేయండి. అప్పుడు ఇంట్లోనే కాదు... ఎక్కడైనా కూర్చుని తీరిగ్గా మాట్లాడుకోండి" అంటూ షర్మిల విమర్శనాస్త్రాలు సంధించారు.

## ఎమ్మెల్యే అనుమతితో ఎల్లారెడ్డి మండలం లోని సమస్యలు తెలుసుకుంటున్న

మాజీ మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ



కామారెడ్డి జిల్లా ప్రతినిధి పోచయ్య (శుభోదయం న్యూస్) : ఎల్లారెడ్డి మండలంలోని కొక్కొండ గ్రామంలో గ్రామస్థుల విజ్ఞప్తి మేరకు గ్రామానికి వెళ్ళిన మాజీ మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు మాట్లాడుతూ ప్రధాన సమస్య అయినటువంటి విద్యుత్ సమస్య గూర్చి చెప్పడం జరిగింది. విషయం తెలుసుకున్న మాజీ మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ గ్రామంలో ఉన్న విద్యుత్ సమస్యల గూర్చి విద్యుత్ ఉన్నతాధికారులతో డిఈ,ఏ ఈ ల తో మాట్లాడారు. విధుత్ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి సమస్య పరిష్కరిస్తామన్నారు. తక్షణమే ఆ గ్రామ ప్రధాన సమస్య అయినటువంటి విద్యుత్ పరిష్కారానికి తనవంతుగా హైమాస్ లైట్స్ మరియు పోల్ బితన సొంత ఖర్చులతో ఇస్తానని మాజీ మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ హామి ఇవ్వడం జరిగింది. గ్రామ విద్యుత్ సమస్యతో పాటు ఇతర ఏ సమస్య ఉన్న గౌరవ ఎమ్మెల్యే మదన్ మోహన్ గారి దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ జరిగింది. ఈ కార్య క్రమంలో మాజీ జడ్పీటీసీ సామేల్, మాజీ ఎంపీటీసీ షకావత్ అలి, గ్రామ మాజీ సర్పంచ్ లక్ష్మయ్య , ఉప సర్పంచ్ జీవన్ గౌడ్, గ్రామ అద్యక్షులు సాయిలు, రామానంద్, బాలరాజు, అనిల్, సంగరం, కిష్టయ్య, అంజయ్య, సంతోష్, నర్సింలు , సాయిలు, గోపాల్, సిద్దిరాములు,అశోక్, నారాయణ, పర్వయ్య తదితరులున్నారు.

## శ్రీ చైతన్య పాఠశాలలో జాతీయ విద్యా దినోత్సవ వేడుకలు




రామగుండం మండలం రిపోర్టర్-తిరుపతి (శుభోదయం న్యూస్) : గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలోని స్థానిక శ్రీ చైతన్య పాఠశాలలో జాతీయ విద్యా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ గారు మాట్లాడుతూ మౌలానా అబుల్ కలాం ఆజాద్ గారి జన్మదినం రోజున ఈ జాతీయ విద్యా దినోత్సవాన్ని జరుపుకుంటామన్నారు. అంతేకాకుండా మౌలానా అబుల్ కలాం ఆజాద్ గారు గొప్ప రాజకీయ వేత్త మరియు ప్రఖ్యాత పండితుడని వీరు భారతదేశంలో మొదటి విద్యా విధానాన్ని రూపొందించి నిర్బంధ విద్యను ప్రవేశపెట్టారు. వీరు భారతదేశంలో జవహర్ లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయాన్ని రూపొందించి ఎంతో మందికి విద్యా అవకాశాలు కల్పించారు. తాను సౌదీ అరేబియాలో జన్మించిన కూడా మన భారతీయ సంస్కృతిని ప్రోత్సహించారు. ఇటువంటి సేవలు అందించిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ గారికి అతని మరణానంతరము 1992 లో భారతరత్న పురస్కారం లభించిందని, ప్రిన్సిపాల్ గారు విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ గారి చిత్రపటానికి పూలమాలలు సమర్పించి వారిని స్మరించుకుని విద్యార్థులని ఇలాంటి గొప్ప వ్యక్తుల బాటలో నడవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, ఏజీఎం అరవింద్ రెడ్డి,కోఆర్డినేటర్ నాగరాజు గార్లు మరియు డీన్ లు,ఇంచార్జిలు, ఏవో సందీప్,ఉపాధ్యాయిని,ఉపాధ్యాయులు మరియు విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.

## కాంట్రాక్టర్ తో కుమ్మక్కై సంతకాలు పెడుతున్న డిపో మేనేజర్ పై చర్యలు తీసుకోవాలి

వేల్పుల కుమారస్వామి, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు



గోదావరిఖని టౌన్ రిపోర్టర్- సురేష్,(శుభోదయం న్యూస్) : గోదావరిఖని బస్ స్టాండ్ లో ఉన్న సులబ్ (మరుగు దొడ్లు) లో ముగ్గురు కార్మికులు అనేక సంవత్సరాల నుండి పనులు చేస్తున్నారు. కానీ వీరి పేర్లు మాత్రం రికార్డుల్లో లేవు. వీరికి నెలకు 6 వేల రూపాయలు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. ఎలాంటి చట్టబద్ధ హక్కులు, సౌకర్యాలు కల్పించడం లేదు. పైగా వీరిపై ఆర్.టి.సి. అధికారులు, సిబ్బంది అందరూ పెత్తనం చెలయిస్తున్నారు. వారు చెప్పినట్లు వినకుంటే పనుల్లోంచి తీసేస్తానని బిదిరింపులకు పాల్పడుతున్నారు. ఇదెక్కడి న్యాయం అంటే మేము ఇలాగే చేస్తాం మీ దిక్కు ఉన్న చోట చెప్పుకోండి అంటు మానసికంగా డిపో మేనేజర్ వేదింపులకు గురిచేస్తున్నారు.కానీ నిజానికి అక్కడ పనులు నిర్వహిస్తున్న వారి పేర్లు మాత్రం రికార్డుల్లో లేవు. రికార్డుల్లో ఉన్నవారు పని చేస్తున్నారో, లేదో డిపో మేనేజర్ కు అవసరం లేదు. పని చేస్తున్న వారు ఎవరైనా తనకు సంబంధం లేదు. కాంట్రాక్టర్ నుండితనకు వచ్చే మామూళ్లునెల నెల వస్తె సరిపోతుందని డిపో మేనేజర్ వ్యవహరిస్తున్నారు.పని చేస్తున్న కార్మికులకు ఏదైనా జరిగితే ఎవరు బాధ్యులు అని సీఐటీయూ గా డిమాండ్ చేస్తున్నాము.పని చేసే వారి పేర్లు ఎందుకు రికార్డుల్లో నమోదు చేయడం లేదు. ఇతరుల పేర్లు మీద పనిచేయిస్తు వారికి వచ్చే వేతనాల్లోంచి 6 వేలు మాత్రమే ఇచ్చి అసలు పనిచేయని వారికి కొంత, డిపో మేనేజర్ కు కొంత కాంట్రాక్టర్ కు కొంత మామూళ్లు పంచుకుంటూ ప్రస్తుతం పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వకుండా ఆర్థిక దోపిడీకి సహకరిస్తున్న గోదావరిఖని బస్ డిపో మేనేజర్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని,కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నాము.

## రామగుండం కార్పొరేషన్ లో అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని.....

అధికారులను ఆదేశించిన అదనపు కలెక్టర్



గోదావరిఖని టౌన్ రిపోర్టర్-సురేష్, (శుభోదయం న్యూస్) : అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు ), రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ ( ఎఫ్ ఎ సి ) అరుణ శ్రీ ఇంజనీరింగ్ అధికారులను, కాంట్రాక్టర్ లను ఆదేశించారు. సోమవారం ఉదయ%శీ% రామగుండం నగర పాలక సంస్థ పరిధిలోని వివిధ డివిజన్ లలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. మార్కండేయ కాలనీలో పెద్ద కాలువ నిర్మాణ పనులు , దుర్గా నగర్ లో పూర్తయిన సి సి రోడ్డు పనులు , ప్యాచ్ వర్కులు , గౌతమి నగర్ నుండి ఎఫ్ సి ఐ క్రాస్ రోడ్స్ వరకు జరుగుతున్న మీడియన్ నిర్మాణ పనులు ఖాజీపల్లి లో భూ గర్భ మురుగునీటి కాలువ నిర్మాణ పనులు, సప్తగిరి కాలనీలో పూర్తయిన సి సి రోడ్డు ను పరిశీలించారు. రాజీవ్ రహదారి వెంబడి వైద్య కళాశాల సమీపంలో ఎన్ పి డి సి ఎల్ సంస్థ వేసిన విద్యుత్ స్థంబం కారణంగా ఏర్పడిన నీటి సరఫరా పైప్ లైన్ లీకేజీ ని పరిశీలించారు. ఈ సంధర్భంగా నగర పాలక సంస్థ ఇ ఇ రామన్ , డి ఇ జమీల్ అహ్మద్ , ఎ ఇ షోయమ్ మీర్ తదితరులు ఉన్నారు.



## విద్యా వ్యవస్థకు గుర్తింపు తీసుకు వచ్చింది మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్



కామారెడ్డి జిల్లా ప్రతినిధి పోచయ్య (శుభోదయం న్యూస్ ):-విద్యా వ్యవస్థకు గుర్తింపు తీసుకు వచ్చింది మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ అని ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్ అన్నారు. సోమవారం ఎల్లారెడ్డి పట్టణంలోని స్థానిక మైనార్టీ గురుకుల జూనియర్ కళాశాలలో డాక్టర్ మౌలానా అబ్దుల్ కలామ్ ఆజాద్ 135 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ఈయన 1888 నవంబర్ 11న మక్కాలో జన్మించారు. విద్యాధికునిగా, కాకుండా రాజకీయంగా కూడా రాణినిచిన వ్యక్తి అజాద్ అని అన్నారు. ఈయన జయంతినీ మైనార్టీ సంక్షేమ దినంగా, జాతీయ విద్యా దినోత్సవంగా జరుపు కోవడం జరుగుతోందని అన్నారు. భారత దేశ విద్యావిధానం పటిష్టవంతం కావడానికి మౌలానా అబుల్ కలాం ఆజాద్ చేసిన కృషి అమోఘం అని కొనియాడారు. స్వాతంత్ర్యానికి పూర్వం విద్యావేత్తగా, రాజకీయంగా రాణించిన ఆయన మేధో సంపత్తిని గుర్తించి, స్వతంత్రం వచ్చిన తర్వాత మొదటి జాతీయ విద్యాశాఖ మంత్రి గా పనిచేసిన ఘనత అబుల్ కలాం ఆజాద్ దే అని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు.కళాశాలలో విద్యార్థుల సంఖ్య తక్కువ ఉండటానికి గల కారణాన్ని ప్రిన్సిపాల్ షరీఫ్ ను అడిగి తెలుసుకున్నారు. 2018 నుంచి కొనసాగుతున్న మెస్ చార్జీలను సీఎం రేవంత్ రెడ్డి సర్కార్ 50 రూపాయాలనుంచి 70 పెంచిందని అన్నారు. గురుకులానికి స్వంత భవన్ నిర్మాణం కోసం స్థానిక ఎమ్మెల్యే మదన్ మోహన్ దృష్టికి తీసుకు వచ్చి నూతన భవన నిర్మానానికి కృషి చేస్తానని అన్నారు.అనంతరం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కురుమ సాయిబాబా మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సకల సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం కొని మైనారిటీ గురుకులానికి, తల్లితండ్రులకు మంచి పేరు తీసుకు రావాలని అన్నారు. ఆతర్వాత ప్రిన్సిపాల్, అధ్యాపకులు జీవిత చరిత్ర, విద్యావ్యవస్థలో తీసుకు వచ్చిన మార్పులను వివరించారు. ఆతర్వాత అతిథులను శాలువా కప్పి సత్కరించారు. మౌలానా ఆజాద్ జయంతి సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారికి అతిథులచే బహుమతులను ప్రదనందేయించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ మండల అద్యక్షులు , కాంగ్రెస్ నాయకులు ఎన్.శ్రీనివాస్, తిరుపతి, పోచయ్య, ప్రిన్సిపాల్ షరీఫ్, అధ్యాపక, అధ్యాపకేతర బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ఆదేశాల మేరకు కులగననలో పాల్గొన్న మండల అధ్యక్షుడు కురుమ సాయిబాబా




కామారెడ్డి జిల్లా ప్రతినిధి పోచయ్య (శుభోదయం న్యూస్ ):-కులగణనకార్యక్రమంలో భాగంగా సోమర్యాఘడ్ తండాలో ఎన్యూమరేటర్తో కల్సి సర్వేలో పాల్గొన ఎల్లారెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కురుమ సాయిబాబా మరియు సోమర్యాఘడ్ తండా గ్రామ కమిటీ అధ్యక్షులు మరియు మండల సోషల్ మీడియా కో ఆర్డినేటర్ నగేష్ నాయక్ గారు మరియు గ్రామ సీనియర్ నాయకులు పాల్గొనడం జరిగింది అలాగే స్థానిక ప్రజలు సంతోషం వక్తం చేస్తూ స్థానిక ఎమ్మెల్యే మదన్ మోహన్, ముఖ్య మంత్రి రేవంత్రెడ్డి కి కాంగ్రెస్ పార్టీ కి ధన్యవాదములు తెలియ చెప్పడం జరిగింది.

## మౌలానా అబుల్ కలాం ఆజాద్ జాతీయ విద్యా దినోత్సవ వేడుకలు




గోదావరిఖని టౌన్ రిపోర్టర్-సురేష్,(శుభోదయం న్యూస్) మౌలానా అబుల్ కలాం ఆజాద్ జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా ముస్లిం వెల్ఫేర్ ఆర్గనైజేషన్ సొసైటీ సభ్యులు గోదావరిఖని స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం పక్కన గాంధీ పార్క్ స్కూల్లో మౌలానా అబుల్ కలాం ఆజాద్ నవంబర్ 11న జయంతి ఘనంగా నిర్వహించారు స్కూల్లో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా, ముస్లిం వెల్ఫేర్ ఆర్గనైజేషన్ సొసైటీ అధ్యక్షుడు షేక్ హాజీ అలీ గారు హాజరై వారి చేతులమీదుగా స్కూల్లో చదువుతున్నటువంటి విద్యార్థిని విద్యార్థులకు ఉచితంగా నోటి బుక్కులు మరియు పెన్ పెన్సిల్ మరియు మిఠాయిలు పంపిణీ చేశారు.. షేక్ హాజీ అలీ గారు ఈ సందర్భంగా మాట్లాడుతూ మౌలానా అబుల్ కలాం ఆజాద్ స్వతంత్ర భారతదేశానికి తొలి విద్యాశాఖ మంత్రి, మౌలానా అబుల్ కలాం ఆజాద్. మౌలానా అంటే పండితుడు, కలాం అంటే భాషా జనకుడు అని అర్థం. ఆజాద్ ఆయన కలం పేరు మహా విధ్వంసుడైన ఆజాద్ విద్యా శాఖ మంత్రి అవ్వడం గొప్ప అదృష్టం. మన దేశంలో విద్య అభివృద్ధికి బాటలు వేసిన తొలి బాటసారి అబుల్ కలాం ఆజాదే..ఆయన అనేక విద్య సంస్కరణలు చేసి దేశ అభ్యున్నత్యానికి కృషి చేశాడు. పిల్లలందరూ ఉన్నత చదువులు చదువుకొని పెద్దపెద్ద మహానీయులు గా ఎదగాలని సూచించారు. చెడు వ్యాసాలకు దూరంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముస్లిం వెల్ఫేర్ ఆర్గనైజేషన్ సొసైటీ వర్కింగ్ ప్రెసిడెంట్ మీరు జాకీర్ అలీ, సొసైటీ సభ్యులు.. హుస్సేన్, మొబీన్, నజీముద్దీన్, మునవర్, శానవాజ్, ఇస్మాయిల్, మోయిన్, అఫ్జల్, సయ్యద్ నాయబ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యా వ్యవస్థకు గుర్తింపు తీసుకు వచ్చింది మౌలానా అబుల్ కలాం ఆజాద్



కామారెడ్డి జిల్లా ప్రతినిధి పోచయ్య (శుభోదయం న్యూస్) : విద్యా వ్యవస్థకు గుర్తింపు తీసుకు వచ్చింది మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్ అన్నారు. సోమవారం ఎల్లారెడ్డి పట్టణంలోని స్థానిక మైనార్టీ గురుకుల జూనియర్ కళాశాలలో డాక్టర్ మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ 135 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ఈయన 1888 నవంబర్ 11న మక్కాలో జన్మించారు. విద్యాధికునిగా, కాకుండా రాజకీయంగా కూడా రాణినిచిన వ్యక్తి అజాద్ అని అన్నారు. ఈయన జయంతినీ మైనార్టీ సంక్షేమ దినంగా, జాతీయ విద్యా దినోత్సవంగా జరుపు కోవడం జరుగుతోందని అన్నారు. భారత దేశ విద్యావిధానం పటిష్టవంతం కావడానికి మౌలానా అబుల్ కలాం ఆజాద్ చేసిన కృషి అమోఘం అని కొనియాడారు. స్వాతంత్ర్యానికి పూర్వం విద్యావేత్తగా, రాజకీయంగా రాణించిన ఆయన మేధో సంపత్తిని గుర్తించి, స్వతంత్రం వచ్చిన తర్వాత మొదటి జాతీయ విద్యాశాఖ మంత్రి గా పనిచేసిన ఘనత అబుల్ కలాం ఆజాద్ దే అని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు.కళాశాలలో విద్యార్థుల సంఖ్య తక్కువ ఉండటానికి గల కారణాన్ని ప్రిన్సిపాల్ షరీఫ్ ను అడిగి తెలుసుకున్నారు. 2018 నుంచి కొనసాగుతున్న మెస్ చార్జీలను సీఎం రేవంత్ రెడ్డి సర్కార్ 50 రూపాయాలనుంచి 70 పెంచిందని అన్నారు. గురుకులానికి స్వంత భవన్ నిర్మాణం కోసం స్థానిక ఎమ్మెల్యే మదన్ మోహన్ దృష్టికి తీసుకు వచ్చి నూతన భవన నిర్మానానికి కృషి చేస్తానని అన్నారు.అనంతరం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కురుమ సాయిబాబా మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సకల సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం కొని మైనారిటీ గురుకులానికి, తల్లితండ్రులకు మంచి పేరు తీసుకు రావాలని అన్నారు. ఆతర్వాత ప్రిన్సిపాల్, అధ్యాపకులు జీవిత చరిత్ర, విద్యావ్యవస్థలో తీసుకు వచ్చిన మార్పులను వివరించారు. ఆతర్వాత అతిథులను శాలువా కప్పి సత్కరించారు. మౌలానా ఆజాద్ జయంతి సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారికి అతిథులచే బహుమతులను ప్రదనందేయించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ మండల అద్యక్షులు , కాంగ్రెస్ నాయకులు ఎన్.శ్రీనివాస్, తిరుపతి, పోచయ్య, ప్రిన్సిపాల్ షరీఫ్, అధ్యాపక, అధ్యాపకేతర బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఎం డి ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిత్యావసర కిట్ల పంపిణీ

పేదలకు కిట్లను అందించిన ఫౌండేషన్ వ్యవస్థాపకులు మాదిరి దేవేందర్ రాజు




పటాన్చెరు (శుభోదయం న్యూస్) : పేద, మధ్యతరగతి, వృద్ధులు, పేదలకు ఇంటికి ఎలాంటి పెద్ద దిక్కు లేకుండా ఉంటున్న ప్రజలు ఆకలితో అల్లాడకుండా చూడాలనే గొప్ప ఉద్దేశంతో ఎండియర్ ఫౌండేషన్ ప్రతి నెలా నిత్యావసర సరుకుల కిట్లను అందిస్తోంది. ఇందులో భాగంగా పేదలకు ఎం డి ఆర్ ఫౌండేషన్ ఛైర్మన్ మాదిరి దేవేందర్ రాజు తన చేతుల మీదుగా వీటిని పంపిణీ చేశారు. కూలీ నాలీ చేసుకొని బతికే పేదలకు నిత్యావసర సరుకుల ఖర్చు భారం తగ్గించేలా ఈ పంపిణీ కార్యక్రమం కొనసాగుతోంది. గత కొన్నేళ్లుగా ఈ పంపిణీ సజావుగా కొనసాగుతోంది. ప్రతి నెలా ఇలా సరుకులు ఇవ్వడం వల్ల తమకు గొప్ప ఊరట దక్కుతోందని స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య



పాపన్నపేట,మండలం రిపోర్టర్-రవి(శుభోదయం న్యూస్):అనారోగ్యంతో బాధపడుతూ ఏ పని చేయలేక కుటుంబ పోషణ ఇబ్బందికరంగా మారి ఉరివేసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని పొమ్లా తండాలో చోటు చేసుకుంది.ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం వివరాలు..ధాక్యాతండా పరిధి లోని పొమ్లా తండాకు చెందిన మునావత్ పోమ్లా(38)కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు.గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ కూలీ పనులు చేయలేకపోయాడు.కుటుంబాన్ని పోషించడం కోసం చిన్న చిన్న అప్పులు చేసి కుటుంబ పోషణ కోసం దిగులు చెందుతుండేవాడు.ఆదివారం సాయంత్రం ఇంట్లో నుండి బయటకు వెళ్లి తండా శివారులోని రోడ్డు పక్కన ఉన్న ఓ చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.అర్థరాత్రి దాటిన తరువాత అటుగా వెళ్లిన తండా వాసులు చెట్టుకు ఉరి వేసుకొని ఉన్న అతన్ని గమనించి కుటుంబీకులకు సమాచారం అందించారు.పోలీసులకు ఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని మెదక్ జిల్లా ఆసుపత్రికి తరలించారు.భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## జాప్ కమిటీ అభివృద్ధికి 10000 విరాళం అందించిన వైఎస్ఆర్సిపి నాయకులు గుజ్జల బొమ్మన్న



ధర్మవరం, నియోజకవర్గం ఇంచార్జ్ గోవర్ధన్ రెడ్డి (శుభోదయం న్యూస్): శ్రీ సత్య సాయి జిల్లా ధర్మవరం పట్టణం మహాత్మా గాంధీ కాలనీకి చెందిన వైఎస్ఆర్సిపి నాయకులు గుజ్జల బొమ్మన్న జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ (జాప్)కమిటీ అభివృద్ధి కోసం పదివేల రూపాయలు విరాళాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత్రికేయ వృత్తిని నమ్ముకుని ప్రజాసేవ లో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటూ రాజకీయ నాయకులు అధికారులు స్వచ్ఛంద సంస్థల కోసం పాటుపడే పాత్రికేయుల కోసం వారి అభివృద్ధి కోసం ఎప్పుడూ ముందు ఉంటామని తెలియజేశారు.

## ఈనెల 12 నుంచి ధర్మవరం రెవిన్యూ డివిజన్ పరిధిలో గ్రామ సభలు

ఎమ్మెల్యే పరిటాల సునీత పిలుపు



ధర్మవరం నియోజకవర్గం ఇంచార్జ్ గోవర్ధన్ రెడ్డి (శుభోదయం న్యూస్,):గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చేపట్టిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక గ్రామసభలు ఈనెల 12 నుంచి ధర్మవరం రెవిన్యూ డివిజన్ పరిధిలో ప్రారంభం కానున్నాయి రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ ధర్మవరం రెవెన్యూ డివిజన్ పరిధిలోని ధర్మవరం నియోజకవర్గంతో పాటు,రాప్తాడు నియోజకవర్గం పరిధిలోని కనగానపల్లి, రామగిరి, చెన్నేకొత్తపల్లి మండలాలలోని అన్ని రెవెన్యూ గ్రామాలలో ఈ గ్రామ సభలు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ, తహసిల్దార్, ఇతర మండల అధికారులంతా హాజరవుతారని తెలిపారు. గ్రామంలో సుదీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యల పై గ్రామసభలు జరగనున్నాయని,ప్రజలు తమ సమస్యలు వచ్చి నేరుగా చెప్పుకోవచ్చు అని అన్నారు. రెవిన్యూ సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం కలెక్టరేట్ కు వెళ్లి విన్నవించుకుంటారని.అయితే ఇది చాలా మందికి వ్యయ ప్రయాసలతో కూడుకున్నదిగా మారిందన్నారు. అందుకే అధికారుల సేవలు మరింత విస్తృతం చేసే విధంగా గ్రామాల్లోనే గ్రామసభల ద్వారా సమస్యలు పరిష్కరించుకోవచ్చన్నారు.మండలంలో ఈనెల 12 నుంచి 28వ తేదీ వరకు గ్రామసభలు జరగనున్నాయని, గ్రామ ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల అభివృద్ధి కోసం, అలాగే గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.

# జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో జనసేన పార్టీలో చేరిక

జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి



ధర్మవరం నియోజకవర్గం ఇంచార్జ్ - గోవర్ధన్ రెడ్డి (శుభోదయం న్యూస్): పవన్ కళ్యాణ్ సమక్షంలో మంగళగిరిలో ధర్మవరం నియోజకవర్గానికి చెందిన వైసీపీ పార్టీ ముఖ్య నాయకులు జనసేన పార్టీలోకి చేరడం జరిగిందని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ ధర్మవరం మున్సిపాలిటీకి చెందిన వైఎస్ఆర్సిపి పార్టీ కౌన్సిలర్లు,మాజీ కౌన్సిలర్లు,వార్డు ఇంచార్జ్ లు ధర్మవరం నియోజకవర్గ ముఖ్య నాయకులు జనసేన పార్టీలోకి చేరడం జరిగింది అని తెలిపారు.వీరందరికీ పవన్ కళ్యాణ్ పార్టీ కండువా కప్పి జనసేన పార్టీలోకి సాదరంగా ఆహ్వానించడం జనసేన పార్టీలో చేరిన వారు 31 వ వార్డు కౌన్సిలర్ రమణమ్మ,28 వ వార్డు కౌన్సిలర్ సరితాల ఆశాబి,12 వ వార్డు కౌన్సిలర్ తొండమల ఉమాదేవి, 12 వ వార్డు మాజీ కౌన్సిలర్ రమాదేవి,13 వ వార్డు మాజీ కౌన్సిలర్ డిష్ రాజు, వైఎస్ఆర్సిపి పార్టీ వార్డు ఇంచార్జ్ లు 31 వ వార్డు ఇంచార్జ్ తోపుదుర్తి వెంకటరాముడు, 28 వ వార్డు ఇంచార్జ్ సరితల మహమ్మద్ భాషా, 12 వ వార్డు ఇంచార్జ్ తొండమల రవి, సౌత్ ఇండియన్ కాపు అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు తొండమల నాగార్జున, తొండమల సోమశేఖర్ పార్టీలో చేరడం జరిగిందన్నారు. అనంతరం చేరిన వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ విధానాలు,ప్రభుత్వ వైఖరి నచ్చక ఆ పార్టీని వీడి జనసేన పార్టీ సిద్ధాంతాలు, పవన్ కళ్యాణ్ ఆశయాలు నచ్చి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో , ధర్మవరం నియోజకవర్గ స్థానికుడైనటువంటి చిలకం మధుసూదన రెడ్డి అడుగుజాడల్లో ప్రజా సేవ చేయడానికి జనసేన పార్టీలోకి చేరడం జరిగిందన్నారు. పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తామని వారు తెలిపారు.

# వైద్యవిద్య రంగాలకు రాష్ట్ర బడ్జెట్ లో భారీ కేటాయింపు

## ధర్మవరం ఎమ్మెల్యే, మంత్రి సత్య కుమార్ యాదవ్



ధర్మవరం, నియోజకవర్గం ఇంచార్జ్ గోవర్ధన్ రెడ్డి (శుభోదయం న్యూస్ ): రాష్ట్ర బడ్జెట్ లో ఆరోగ్య, కుటుంబ సంక్షేమం మరియు వైద్య విద్య కోసం రూ. 18,421 కోట్లు కేటాయించిన ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు కు,ఆర్థిక శాఖామాత్యులు పయ్యావుల కేశవ్ కు, ఆరోగ్య శాఖ మంత్రివర్యులు సత్య కుమార్ యాదవ్ ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే, ఈ బడ్జెట్ కేటాయింపు 23 శాతం పెరిగినట్లు తెలిపారు. పాఠశాల,కళాశాల, ఉన్నత విద్య తరవాత అత్యధికంగా ఆరోగ్య రంగానికి కేటాయింపులు చేయడం ద్వారా ప్రజారోగ్య సంరక్షణకు ప్రాముఖ్యతనిస్తూ, ఎన్డీయే ప్రభుత్వం తమ సంకల్పాన్ని ప్రదర్శించింది అని ఆయన అన్నారు.ఈ కేటాయింపు ద్వారా రాష్ట్రంలోని ఆరోగ్య సేవలు మరింత మెరుగుపడతాయని, ప్రజల ఆరోగ్యం కోసం కీలకమైన పథకాలు, సదుపాయాలు మరింత విస్తరించనని తెలిపారు. ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో ఆరోగ్య రంగానికి మరింత ముఖ్యమైన ప్రాధాన్యత ఇవ్వడం, ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించడం ఎల్లప్పుడూ ప్రభుత్వ ప్రథమ కర్తవ్యం అని ఆయన తెలిపారు. ఈ ప్రగతిశీల బడ్జెట్ కేటాయింపుతో, ప్రజల ఆరోగ్యం పట్ల రాష్ట్ర ప్రభుత్వం అత్యంత శ్రద్ధ కట్టుబాటును కొనసాగిస్తుందన్నారు అని తెలిపారు. ఎన్డీఏ ప్రభుత్వం యొక్క హయాంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు.

# శానిటేషన్ వర్కర్స్ కు పెండింగ్ వేతనాలు చెల్లించండి

## యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు..నాగవేణి,లక్ష్మీదేవి.



ధర్మవరం, నియోజకవర్గం ఇంచార్జ్ గోవర్ధన్ రెడ్డి (శుభోదయం న్యూస్):ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్ కు పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని యూనియన్ నాయకులు నాగవేణి ,లక్ష్మీదేవి పేర్కొన్నారు.ఈ సందర్భంగా సిఐటియు ఆధ్వర్యంలో ఆర్డీవో మహేష్ కు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం యూనియన్ నాయకులతోపాటు సిఐటియు నాయకులు అయూబ్ కాన్ , ఆదినారాయణ మాట్లాడుతూ ధర్మవరం రెవిన్యూ డివిజన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్స్ (ఆయాలకు) పెండింగ్లో ఉన్న నాలుగు నెలల వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు.వేతనాలు రాకపోవడంతో వారి కుటుంబాలు ఆర్థికంగా అనేక ఇబ్బందులకు గురి కావాల్సి వస్తుందని, నిత్యవసర వస్తువుల ధరలు నిరంతరం పెరగడంతో కార్మికుల కుటుంబాలు ఏమి కొనేటట్లు కానీ, ఏమి తినేటట్లు కానీ లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.ముఖ్యంగా వారికి ప్రభుత్వం కేవలం 6000 రూపాయలు మాత్రం వేతనాలు ఇస్తున్నదని, చాలీచాలని వేతనాలతో వారి కుటుంబాలు గడవడం చాలా దారుణంగా ఉన్నాయన్నారు, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని, పి.ఎఫ్. ఈ.ఎస్.ఐ. సౌకర్యాలను కల్పించి,సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి వారి సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. తొలుత ఆర్డిఓ కార్యాలయ ఆవరణ ముందు ధర్నా నిర్వహించారు ఈ కార్యక్రమంలోయూనియన్ నాయకులుచౌడమ్మ, జయమ్మ, అంజనమ్మ వరలక్ష్మి, ఫరాన, తదితర కార్మికులు పాల్గొన్నారు.

# డ్యాంలో దూకి యువకుని ఆత్మహత్య!



రెంటచింతల, మండల రిపోర్టర్ - శ్రీనివాసరావు (శుభోదయం న్యూస్): మండలంలోని రెంటాల గ్రామానికి చెందిన నిరుద్యోగ యువకుడు వ్యక్తిగత కారణాలతో మంచికల్లు డ్యాంలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కొత్త అఖిల్(29) గత కొంతకాలంగా ఇంజనీరింగ్ లో పట్టబద్ధుడై నిరుద్యోగిగా ఉంటున్నాడు. అయితే జీవితంపై విరక్తి చెందిన అతను ఇంట్లోని తల్లిదండ్రులకు చెప్పకుండా సోమవారం రాత్రి 7 గంటల సమయంలో మంచికల్లు డ్యామ్ వద్దకు చేరుకొని నీటిలో దూకినట్టు సమాచారం. ఈ సందర్భంగా అతను తన సెల్ ఫోను పక్కనపెట్టి, ఆత్మహత్య చేసుకుంటున్నట్లు కాగితంపై రాసి తన స్నేహితులకు మెసేజ్ పంపించాడు. దీంతో ఆందోళన చెందిన తల్లితండ్రులు స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వగా పోలీసులు డ్యాం వద్దకు వెళ్లి గాలింపు చర్యలు చేపట్టారు. ఈ విషయమై స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు.

# రైల్వేస్టేషన్ రోడ్డు అభివృద్ధికి నిధులు కేటాయిస్తా

ఎం పి బికె పార్థసారథి హామీ

రైల్వేస్టేషన్ రోడ్డును పరిశీలించిన ఎం పి బికె



శ్రీసత్యసాయిజిల్లా బ్యూరో పోతులయ్య (శుభోదయం న్యూస్ ):పెనుకొండ పట్టణంలో రైల్వే స్టేషన్ రోడ్డు అభివృద్ధికి నిధులు కేటాయిస్తానని హిందూపురం ఎం పి బికె పార్థసారథి తెల్పారు.హిందూపురం పార్లమెంట్ పరిదిలోని పెనుకొండ రైల్వేస్టేషన్ రోడ్డును బాగుచేయాలని ప్రజల వద్ద నుండి పెద్ద ఎత్తున హిందూపురం




పార్లమెంటు సభ్యులు బి కే పార్థసారథి కి వినతులు రావడంతో సోమవారం టిడిపి నాయకులు,పార్టీశ్రేణులతో కల్సి రైల్వేస్టేషన్ రోడ్డును పరిశీలించారు. రోడ్డు, డ్రైనేజీ వ్యవస్థ, వీధి దీపాలు ఏర్పాటుకు సంబంధించి అధికారులతో ఎం పి బికె పార్థసారథి చర్చించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పెనుకొండ పట్టణంలో రైల్వే స్టేషన్ రోడ్డు, డ్రైనేజీ వ్యవస్థ, వీధి దీపాలు లేక చాలా అధ్వానంగా ఉంది. కియా కార్ల కంపెనీ వచ్చిన తరువాత పెనుకొండ పట్టణం శరవేగంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో ఈ రైల్వే స్టేషన్ రోడ్డు, డ్రైనేజీ వ్యవస్థ, వీధి దీపాలు ఏర్పాటు చేయడం చాలా అవసరం. పెనుకొండ రైల్వే స్టేషన్ రోడ్డు చాలా అధ్వానంగా ఉందని ప్రజలు వినతిపత్రాలు ఇచ్చారు. దీనిని దృష్టిలో ఉంచుకుని పెనుకొండ రైల్వే స్టేషన్ రోడ్డు, డ్రైనేజీ వ్యవస్థ, వీధి దీపాలు పార్లమెంటు సభ్యుల నిధులతో త్వరితగతిన నిర్మిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు,జివిపి నాయుడు,మాజీసర్పంచ్ సుబ్బరారుడు,కన్నాస్వామి కార్యకర్తలు,ప్రసాద్ ,శేఖర్ ,అనీల్ , ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

# దళితులపై దౌర్జన్యం చేసిన

## అగ్ర కుల భూస్వామిని అరెస్ట్ చేయాలి : డి.పి పోలయ్య డిమాండ్



నెల్లూరు జిల్లా, సైదాపురం మండలం (శుభోదయం న్యూస్): సైదాపురం మండలం,జోగిపల్లి గ్రామంలోని దళితులు సాగుచేస్తున్న అసైన్డ్ భూములకు వేసిన కంచెను దౌర్జన్యముగా తగలబెట్టి దళితులు పై దుర్భాషలాడి దౌర్జన్యము చేసిన అగ్రకుల భూస్వామి మేకల కృష్ణమనాయుడు పై ఎస్సి,ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని,దళితులు సాగుచేస్తున్న అసైన్మెంటు భూముల పై అక్రమముగా ఇచ్చిన సెటిల్మెంటు పట్టాలను రద్దు చేయాలనీ అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డిమాండు చేస్తూ మంగళవారం సైదాపురం మండల తహశీల్దారు కార్యాలయము వద్ద దళితులతో కలిసి ధర్నా చేసి తహశీల్దారు కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది.ఆ సందర్భంగా అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు డి.పి పోలయ్య మాట్లాడుతూ ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దళితులు,గిరిజనుల పై దాడులు కొనసాగుతున్నాయి తప్పా ఎవరికి న్యాయం జరగక పోవడమే కాకా,మరోవైపున దళితులు,గిరిజనుల భూములను అధికార పార్టీ అండదండలతో భూస్వాములు ఆక్రమణలు కొనసాగుతున్నాయి అన్నారు.దళితులు,గిరిజనులు పై జరుగుతున్న దాడులను నివారించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం అవుతుందన్నారు.ఈ క్రమంలో జోగిపల్లి గ్రామములో సర్వే నెం.15 లో 15.52 ట్లు ఎకరాల భూమి ఆదూరి రమణయ్య పేరున కలిగివున్నది అన్నారు. సదరు భూమిలో ఎస్టేట్ అబాలిష్ యాక్ట్, సీలింగ్ యాక్ట్ ద్వారా 26.10.1976 న సర్వే నెంబర్ 15-2 లో 8 ఎకరాలు భూమిని ప్రభుత్వం స్వాధీనము చేసుకున్నది.సదరు సర్వే నెం.15-1 లో 8 ఎకరములు భూమిని దళితులకు అసైన్మెంటు పట్టాలుగా మంజూరు చేసియున్నారన్నారు.అదేవిదంగా దళితులు సాగుచేస్తున్న అసైన్డ్ భూములకు వేసిన కంచెను అధికార పార్టీ అండదండలతో దౌర్జన్యముగా తగలబెట్టి దళితులు పై దుర్భాషలాడిన అగ్రకుల భూస్వామి మేకల కృష్ణమనాయుడు పై "ఎస్సి ఎస్టీ అట్రాసిటి" కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని,అదేవిదంగా దళితులు సాగుచేస్తున్న అసైన్మెంటు భూములపై కృష్ణమ నాయుడు అనుచరులకు ఇచ్చిన అక్రమ సెటిల్మెంటు పట్టాలను రద్దు చేసి దళితులకు యాజమాన్యహక్కు కల్పించి దళితులకు రక్షణ కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు.అలాగే జోగిపల్లి గ్రామములోని భూ రీ సర్వే లో గుర్తించిన ప్రభుత్వ బంజరు మిగులు పోరంబోకు భూములను పేదలకు పంపిణీ చేయాలనీ లేని పక్షంలో ఉద్యమాన్ని ఉదృతం చేస్తానని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తూ ఆయన డిమాండు చేశాడు.ఈ కార్యక్రమములో అఖిల భారత రైతు కూలి సంఘం జిల్లా నాయకులు పందిటి వెంకటయ్య పందిటి కృష్ణయ్య పందిటి వేణయ్య తెగచెర్ల పెంచలయ్య ప్రగతిశీల మహిళా నాయకులు గడ్డం రమణమ్మ,కురుగొండ శారద పాల్గొన్నారు.

# టంగుటూరులో ప్రత్యమ్నాయ పంటలు సాగుపై జరిగిన సదస్సు

ముఖ్యఅతిథిగా పాల్గొన్న

టిడిపి రాష్ట్ర రైతు కార్యదర్శి - బెజవాడ వెంకటేశ్వర్లు



టంగుటూరు మండల రిపోర్టర్ - వెంకటేశ్వర్లు టీ (శుభోదయం న్యూస్) : పొగాకు పట్టుకు ప్రత్యామ్నాయ పంటలను వేయాలని తెలియజేస్తూ టంగుటూరులో రైతులకు అవగాహన సదస్సు సోమవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర రైతు కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రైతులు మట్టి పరీక్షలు ఆధారంగా పంటలు ఎరువులు వేయాలని చౌడు భూముల రైతులకు ప్రభుత్వం సబ్సిడీ మీద జిప్సం ఎరువులు సరఫరా చేయాలని సంబంధిత అధికారులను కోరడం జరిగింది. టంగుటూరు మండల వ్యవసాయాధికారి శ్రీమతి జి స్వర్ణలత మాట్లాడుతూ పొగాకు పంటకు ప్రత్యమ్నయంగా



మినుము శనగ తదితర ఆహార పంటలు పండించాలని అదేవిధంగా మేలైన విత్తన రకాల ఎంపిక విషయంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని విత్తన శుద్ధి సమగ్ర ఎరువుల వాడకం సస్యరక్షణ చర్యలు గురించి రైతులకు ఆమె సూచనలు సలహాలు ఇవ్వడం జరిగింది. రబి 2024 - 25 సీజన్ కి సంబంధించి ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన కింద పంటల బీమా తప్పనిసరిగా చేయించుకోవాలని స్వర్ణలత తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు మక్కెన కోటేశ్వరరావు వ్యవసాయ శాఖ సంచాలకులు శృతి కుమారి లింగారావు విస్తరణ అధికారి శ్రీనివాసరావు తదితరులు మరియు టంగుటూరు వెలగపూడి గ్రామాల రైతులు రైతు నాయకులు ఈ సదస్సులో పాల్గొనడం జరిగింది.

# రైతు సేవ కేంద్ర సిబ్బందికి యాజమాన్య పద్ధతులపై శిక్షణ కార్యక్రమం



సింగరాయకొండ, మండల రిపోర్టర్ - పసుమర్తి జాలయ్య, (శుభోదయం న్యూస్): సింగరాయకొండ సబ్ డివిజన్ పరిధిలోని 4 మండలాలు సింగరాయకొండ, జరుగుమల్లి, కొండేపి, పొన్నలూరు మండలాల వ్యవసాయధికారులకు, వ్యవసాయ విస్తరణాధికారులకు, రైతు సేవా కేంద్ర సిబ్బందికి జిల్లా వనరుల కేంద్రం, ఒంగోలు వారి ఆధ్వర్యంలో %=ఖవ్ =ూఖీూూూ=% పథకము 2024-25 క్రింద కెపాసిటీ ఎన్హాన్స్మెంట్ మరియు రబీ పంటలలో చేపట్టవలసిన మేలైన యాజమాన్య పద్ధతులపై శిక్షణా కార్యక్రమం నిర్వహించడమైనది.ఈ శిక్షణా కార్యక్రమానికి జిల్లా వ్యవసాయాధికారి మరియు పి. డి. ఆత్మ యస్. శ్రీనివాస రావు ముఖ్య అతిధులుగా పాల్గొని వ్యవసాయ శాఖ ద్వారా అమలవుతున్న అన్ని పథకాలు రైతులకు చేరవేయాలని, ప్రతీ రైతు సేవా కేంద్ర సిబ్బంది వారి గ్రామ పరిధిలో సాగు చేసే అన్ని పంటలపై సాంకేతిక పరిజ్ఞానాన్ని కలిగియుండి రైతులకు ఎప్పటికప్పుడు సాంకేతిక సలహాలు, సూచనలు ఇస్తూ రైతు అభ్యున్నతికి తోడ్పడాలని, ఇలాంటి శిక్షణల ద్వారా రైతు సేవా కేంద్ర సిబ్బంది వారి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.ఆత్మా డి. పి. డి. యం. సుబ్రమన్యేశ్వర రావు భూసార పరీక్షా ఫలితాలను రైతులకు తెలియజేసి, నేల ఆరోగ్యం, భూసార పరీక్షా ఫలితాల ఆధారంగా ఎరువుల యాజమాన్యం గురించి, రసాయనిక ఎరువులు తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకం పెంచి నేలలో సేంద్రియ కర్బన శాతాన్ని పెంచేలా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు.జిల్లా వనరుల కేంద్రం సమన్వయకర్త రామ్మోహన్ జీవన ఎరువులు, జీవ శిలీంద్ర నాసినులు, పంట దసలు, పురుగులు, తెగుళ్లు, పోషక లోపల మొబైల్ అప్లికేషన్, యన్. పి. యస్. యస్. అప్లికేషన్ ప్రాముఖ్యత గురించి తెలియజేశారు.సి. టి. ఆర్. ఐ,కృషి విజ్ఞాన కేంద్రం, కందుకూరు హెడ్ జి. ప్రసాద్ బాబు శనగ, పొగాకు పంటల్లో ఎరువులు యాజమాన్యం, తెగుళ్ల యాజమాన్యం గురించి తెలియజేశారు. సి. టి. ఆర్. ఐ,కృషి విజ్ఞాన కేంద్రం, కందుకూరు యస్. యం యస్. ఐ. వెంకటేష్ వరి, కంది పంట లో పురుగులు, తెగుళ్ళ యాజమాన్యం గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారులు ఎ. శైలజారాణి, వి. వి. శేషమ్మ, సింగరాయకొండ సబ్ డివిజన్ పరిధిలోని నాలుగు మండలాల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు మరియు రైతు సేవా కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

# తాళ్లూరు రమణయ్య నాయుడు మృతి



దగదర్తి(శుభోదయం న్యూస్ ): మండలానికి చెందిన సీనియర్ రాజకీయ నాయకుడు, నెల్లూరు జిల్లా కో-ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ మాజీ చైర్మన్ తాళ్లూరు రమణయ్య నాయుడు మృతి చెందారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి పమిడి రవికుమార్ చౌదరి తన సంతపాన్ని తెలియజేసారు. నీతి, నిజాయితీ, విలువలు కలిగిన కల్మషం లేని వ్యక్తి తాళ్లూరు రమణయ్య నాయుడు అని తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానన్నారు. తాళ్లూరు రమణ నాయుడు ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తున్నానని తెలిపారు.

# సిమెంట్ రోడ్డు పనులకు శంకుస్థాపన



దగదర్తి (శుభోదయం న్యూస్ ): మండలంలోని శ్రీరామపురం పంచాయతీలోని రామాలింగాపురంలో సిమెంట్ రోడ్డు పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. కావలి శాసనసభ్యులు కావ్య క్రిష్ణారెడ్డి ఆదేశాల మేరకు స్థానిక టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, దగదర్తి మండల టీడీపీ ఇంచార్జి పమిడి రవికుమార్ చౌదరి సిమెంట్ రోడ్లకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు పార్లమెంట్ రైతు ప్రధాన కార్యదర్శి జలదంకి శ్రీహరి నాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు అల్లం హనుమంతరావు, చెన్నూరు గ్రామ యూనిట్ ఇంచార్జి పాపన మల్లిఖార్జున రెడ్డి, బి.టి శ్రీనివాసులు రెడ్డి, ఈదల రవికృష్ణారెడ్డి, నలుబోలు రాధాకృష్ణారెడ్డి, రెడ్డిమాచు రవీంద్ర, గాలిసురేష్, గాలి రమేష్, మల్లిఖార్జున, హజరతయ్య, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# శ్రీ వెంకటేశ్వర స్వామి సన్నిధిలో మాజీ ఎమ్మెల్యే మేకపాటి ప్రత్యేక పూజలు

మేకపాటిని ఘనంగా సన్మానించిన ఆలయ ధర్మకర్త పెండ్యాల



ప్రకాశం జిల్లా బ్యూరో - చంద్ర (శుభోదయం న్యూస్): ఉదయగిరి నియోజకవర్గం వరికుంటపాడులో నూతనంగా నిర్మించినటువంటి శ్రీ పద్మావతి శ్రీ గోదాదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా సోమవారం ఉదయగిరి మాజీ శాసనసభ్యులు మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త పెండ్యాల సూర్యనారాయణ ఆలయ మర్యాదలతో మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి కి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయ అర్చకులు గోత్రనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి తీర్థప్రసాదాలను పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయగిరి నియోజకవర్గం లోని ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో తులతూగాలనీ సకాలంలో వర్షాలు పడి రైతులు సుఖశాంతులతో జీవించాలని ఆ దేవదేవుడు శ్రీ వెంకటేశ్వర స్వామిని ప్రార్థిస్తున్నాను అన్నారు. అనంతరం ఆలయ ధర్మకర్త పెండ్యాల సూర్యనారాయణ శాలువా శ్రీ వెంకటేశ్వర స్వామి చిత్రపటంతో మేకపాటి చంద్రశేఖర్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఆయన వెంట స్థపతి ప్రసాదరావు ఉన్నారు.

# యాదవ కార్పొరేషన్ చైర్మన్ గోళ్లకి హార్దిక శుభాకాంక్షలు

## మండల తెలుగు యువత ఉపాధ్యక్షులు రవికుమార్



కందుకూరు, అర్సీ ఇంచార్జ్ - శ్రీకాంత్ (శుభోదయం న్యూస్):యాదవ కార్పొరేషన్ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ చైర్మన్ గా నియమితులైన గోళ్ల నరసింహ యాదవ్ కి కందుకూరు మండలం తెలుగు యువత ఉపాధ్యక్షులు జిల్లలముడి రవికుమార్ శుభాకాంక్షలు తెలిపారు. టిడిపి పార్టీలో క్రమశిక్షణ కలిగిన నాయకుడిగా నరసింహారావు కి గుర్తింపు ఉందని తెలిపారు. పార్టీకి ఆయన చేసిన సేవలను గుర్తించి అధిష్టానం అంత గొప్ప బాధ్యతను నరసింహ యాదవ్ కి ఇవ్వడం శుభపరిణామయమని అన్నారు. కందుకూరు నియోజకవర్గంలో కూడా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరావు యాదవులను గుర్తించి నియోజకవర్గంలో సముచిత స్థానం కల్పించాలని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్లోని యాదవుల అభివృద్ధి, సంక్షేమం కోసం సీఎం చంద్రబాబు నాయకత్వంలో యాదవులందరూ ఒక తాటిపై ఉండి రాష్ట్ర అభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు. చైర్మన్ గా ఎన్నికైన నరసింహ యాదవ్ రాష్ట్రంలోని యాదవుల అభివృద్ధి కోసం తన వంతుగా కృషి చేయాలని తెలిపారు. నరసింహ యాదవ్ ని చైర్మన్ గా ఎన్నిక చేయడం తనను ఎంతో సంతోషపరిచిందని ఆయన పేర్కొన్నారు ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడుకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. త్వరలోనే నూతన చైర్మన్ నరసింహ యాదవ్ ను కలిసి శుభాకాంక్షలు తెలుపనున్నట్లు ఆయన అన్నారు.

# చీరాల వాడరేవులో సాగర హారతి

శ్రీ కామాక్షి కేర్ హాస్పిటల్ ఎండి డాక్టర్ తాడివలస దేవరాజు, అర్చక స్వాములు మరియు వేద పండితులు కారంచేటి నగేష్ కుమార్, వీట వెంకటేష్, హిందూ చైతన్య వేదిక







చీరాల, (శుభోదయం న్యూస్): చీరాలలో వాడరేవు నందుగల ఆంజనేయ స్వామి ఎదురుగా కార్తిక సోమవారం రోజున సాగర హారతి కార్యక్రమాన్ని శ్రీ కామాక్షి కేర్ హాస్పిటల్ ఎండి డాక్టర్ తాడివలస దేవరాజు, అర్చక స్వాములు మరియు వేద పండితులు కారంచేటి నగేష్ కుమార్, వీట వెంకటేష్, హిందూ చైతన్య వేదిక చీరాల వారి ఆధ్వర్యంలో శివ పార్వతుల పూజా మరియు సముద్ర హారతి కార్యక్రమాలు నిర్వహించడం జరిగినది.ఈ సందర్భంగా జ్వాలా నరసింహారావు మరియు డాక్టర్ తాడివలస దేవరాజు మాట్లాడుతూ కార్తిక పౌర్ణమి రోజున హైందవ శంఖారావంలో భాగంగా చీరాల వాడరేవు నందు 15వ తేది శుక్రవారం సాయంత్రం భజన కార్యక్రమం మరియు సాగర తీరాన శివాభిషేకం, సామూహిక సాగర హారతి కార్యక్రమం నిర్వహించబడుతుందని, ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయవలసిందిగా పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కారంచేటి నగేష్ కుమార్, విట వెంకటేశ్, గోపి, రఘు, శ్రీ మహాలక్ష్మి మహిళా భజన బృందం సభ్యులు, ఓడరేవు ప్రాంత ప్రజలు పాల్గొన్నారు.

## 18న ఇళ్ల స్థలాల పై జరిగే ధర్నాన్ని జయప్రదం చేయండి



కందుకూరు, అర్సీ ఇంచార్జ్ - శ్రీకాంత్ (శుభోదయం న్యూస్):పేదలకు గ్రామాలలో మూడు సెంట్లు పట్టణాలలో రెండు సెంట్లు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఇంటి నిర్మాణం కోసం ఐదు లక్షల చొప్పున మంజూరు చేయాలని కోరుతూ ఈనెల 18వ తేదీన సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బి సురేష్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం హయాంలో పేదలకు గ్రామాలలో ఒకటిన్నర సెంట్లు, పట్టణాల్లో ఒక సెంటు ఇవ్వటం జరిగింది. ఆయా ఇళ్ల స్థలాలు పట్టణాలకు సుదూరంగా నివాసయోగ్యం కానీ ప్రాంతాలలో కేటాయించడం జరిగింది. అందులో చాలా మంది పేదలకు ఇప్పటివరకు ఇళ్ల స్థలాలు చూపలేదు. ప్రభుత్వం ఇచ్చే ఒక సెంటు స్థలం పేదల నివాసానికి ఏ మాత్రం సరిపోదని భారత కమ్యూనిస్టు పార్టీ( సిపిఐ), ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆనాడే వైసిపి ప్రభుత్వాన్నికి చెప్పినప్పటికీ ఖతార్ చేయకుండా నాటి ప్రభుత్వం మొండిగా ముందుకెళ్ళింది. కాకి లెక్కలతో 32 లక్షల మందికి ఇళ్లపట్టాలు ఇచ్చినప్పటికీ పేదల ఆ స్థలాలు పట్ల సుముకత చూపలేదు. పైగా ఇంటి నిర్మాణానికి ఇచ్చే ఆర్థిక సహాయం కూడా కేవలం 1.80.000 మాత్రమే ప్రకటించారు. ఆ ఆర్థిక సహాయంతో పునాదులు కూడా పూర్తి చేయలేమని పేదలవ్వరు కూడా ఇంటి నిర్మాణం చేపట్టలేదు వైసీపీ ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలు పట్టాలు నిరుపయోగంగా మారాయి. ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికలకు ముందు పేదలకు గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ముఖ్యమంత్రి అదే విధంగా హామీ ఇస్తూ, ప్రతి ఇంటి నిర్మాణానికి నాలుగు లక్షల చొప్పున ఇస్తామని చెప్పడం జరిగింది. ఇంటి స్థలాల కేటాయింపులు పట్ల చంద్రబాబు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సానుకూలమే. సిమెంట్, ఇటుక, ఇనుము, కంకర, సామాగ్రి ధరలు పెరిగిన రీత్యా 5 లక్షలకు పెంచి గృహ నిర్మాణం మంజూరు చేయాలి. పేదలిల్లు నిర్మాణానికి సిమెంటు, ఇసుక, ఇనుము, ఇటుక, కంకర ప్రభుత్వం ఉచితంగా సప్లై చేయాలి. ఇళ్ల స్థలాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పట్టణాల్లో, గ్రామాల్లో నివాసయోగ్యంగా గృహ నిర్మాణానికి అనువైన ప్రాంతాలను గుర్తించి గత వైసిపి ప్రభుత్వం హయాంలో ఏర్పాటు చేసిన లేఔట్లను మార్పు చేసి పేదలకు గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాల కేటాయించాలి. రోడ్లు, విద్యుత్తు, త్రాగునీరు, డ్రైనేజీ పారుదల వంటి మౌలిక సౌకర్యాలు కల్పించాలి ఆయన అన్నారు. సిపిఐ సహాయక కార్యదర్శి పి బాల కోటయ్య మాట్లాడుతూ పేదల ఇళ్ల స్థలాల నిర్మాణం కోసం ఆర్థ కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నవంబర్ 18వ తేదీన సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా పేదలతో వ్యక్తిగత అర్జీలు అందించే ఆందోళన కార్యక్రమం చేపట్టింది. ఇప్పటికే పట్టణాల్లో ఒక సెంటు పట్టా ఉన్నవారు రెండు సెంట్ల కొరకు, గ్రామాలలో ఒకటిన్నర సెంట్లు పట్టా ఉన్నవారు మూడు సెంట్ల కొరకు దరఖాస్తు చేయాలని ఇళ్ల స్థలాలు లేని వారు కొత్తగా తమ వ్యక్తిగతర్జీలతో ఈ ఆందోళన కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వై ఆనందమోహన్, ఏఐవైఎఫ్ నియోజకవర్గ అధ్యక్షులు సిహెచ్ దుర్గాప్రసాద్, ఏఐవైఎఫ్ నాయకులు హరిబాబు పాల్గొన్నారు.

## జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా వేడుకలు నిర్వహించిన లయన్స్ క్లబ్



యాడికి, మండల రిపోర్టర్-బండారు బాలకృష్ణ (శుభోదయం న్యూస్ ): మండలంలోని రాయల చెరువు క్లబ్ నందు లయన్స్ క్లబ్ నందు జాతీయ విద్యా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు.ఈ కార్యక్రమంలో ముందుగా లయన్స్ అధ్యక్షులు చల్లా సూర్యనారాయణ జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడుతూ మనదేశంలో విద్య అభివృద్ధికి బాటలు వేసిన తొలి బాటసారి అబ్దుల్ కలాం ఆజాద్. ఆయన భారతదేశ మొదటి విద్యా శాఖ మంత్రిగా పని చేశారు. నవంబర్ 11న ఆయన జన్మదినం సందర్భంగా మన దేశంలో జాతీయ విద్యా దినోత్సవాన్ని జరుపుకుంటారు. 1888 నవంబర్ లో జన్మించిన మౌలానా 1947 ఆగస్టు 15 నుండి అంటే స్వతంత్రం వచ్చిన నాటి నుండి ఫిబ్రవరి రెండు వరకు కేంద్ర విద్యా శాఖ మంత్రిగా సేవలు అందించారు. ఈయన సేవలను గుర్తించిన భర్త ప్రభుత్వం ఈయనకు భారతరత్న అవార్డు సైతం ఇచ్చింది. అంతేకాదు ఈయన పేరిట పలు విద్యాసంస్థలు కూడా నెలకొల్పబడ్డాయి అని చెప్పుకొచ్చారు .2008 న భారత ప్రభుత్వం ఈయన సేవలను గుర్తించి ఆయన జన్మదినాన్ని జాతీయ విద్యా దినోత్సవం గా నిర్ణయించింది. ఈ కార్యక్రమంలో లయన్ సత్యనారాయణ,కుల శేఖరన్న, ఇస్మాయిల్, మురళీకృష్ణ, అల్లా బకాష్ , రామకృష్ణ , పాల్గొనడం జరిగింది.

## జాతీయ విద్యా దినోత్సవం...



(శుభోదయం న్యూస్ ):ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, భారతదేశ తొలి విద్యాశాఖామంత్రి, భారతరత్న శ్రీ మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ గారి జయంతి సందర్భంగా ఆ మహనీయుడికి ఘన నివాళులు అర్పిస్తూ.. విద్యార్థులందరికీ జాతీయ విద్యా దినోత్సవ శుభాకాంక్షలు...అనంతపురం జిల్లా తాడపత్రి నియోజకవర్గం తాడపత్రి పట్టణంలో పాత మున్సిపాలిటీ ఆఫీస్ దగ్గర మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నూర్ భాషా ముస్లిం దూదేకుల సేవా సంఘం ప్రెసిడెంట్ సెక్రటరీ గౌరవ అధ్యక్షులు కార్యవర్గ సభ్యులు అందరూ పాల్గొన్నారు.


## భావితరాలకు ఆదర్శప్రాయుడు మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్

షేక్ హాజీ గౌస్, ప్రకాశం జిల్లా ముస్లిం సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు



ప్రకాశం జిల్లా బ్యూరో - చంద్ర (శుభోదయం న్యూస్): భారత జాతీయ ఉద్యమంలో ప్రముఖ పాత్ర వహించిన మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ 136వ జయంతి వేడుకలు కనిగిరి నియోజకవర్గం పామూరు పట్టణంలోని ముస్లిం సంక్షేమ సంఘం కార్యాలయంలో పట్టణ ముస్లిం ప్రముఖుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాశం జిల్లా ముస్లిం సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు షేక్ హాజీ గౌస్ మాట్లాడుతూ విదేశీయుల పాలనకు స్వస్తి పలకాలంటే సాయుధ పోరాటమే శరణ్యమని భావించి పలు విప్లవ సంఘాలను మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ ఏర్పాటు చేసి స్వాతంత్ర పోరాటంలో ప్రముఖ పాత్ర పోషించారని ఆయన కొనియాడారు. అబ్దుల్ కలాం పలు గ్రంథాలను రాసి ప్రచురించి మహాకవిగా, పండితునిగా, అద్భుత మేధాశక్తి గల ధార్మికవేత్తగా ఎనలేని ఖ్యాతిని అర్జించారని అన్నారు. స్వాతంత్ర పోరాటంలో సుమారు పది సంవత్సరాల ఏడు నెలల పాటు దేశంలోని వివిధ జైళ్ళ లో అబ్దుల్ కలాం శిక్ష అనుభవించినట్లు ఆయన తెలిపారు. హిందూ ముస్లింల ఐక్యతకు ఎనలేని కృషిచేసిన మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ భావితరాలకు ఆదర్శ ప్రాయుడని తెలిపారు. ఈ కార్యక్రమంలో షేక్ హుస్సేన్, సయ్యద్ అబ్దుల్ రషీద్, ఎస్ డి మౌలాలి, షేక్ సలాం కాజముద్దీన్, షేక్ కాసిం సాహెబ్, షేక్ చాంద్ బాషా, షేక్ ఆర్ ఆర్ రఫీ, పత్తు మస్తాన్, మాచర్ల రెహ్మాన్, వై అస్లీమ్, వై రహీముల్లా, షేక్ సంధాని, సుప్రీమ్ రెహ్మాన్, షేక్ మీరాముద్దీన్ పలువురు ముస్లిం మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

## జగన్ కలిసిన సత్తిరెడ్డి



ఎర్రగొండపాలెం ఇంచార్జి - కాకర్ల కోటయ్య (శుభోదయం న్యూస్): వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని సోమవారం తాడేపల్లి లోని తన నివాసంలో పుల్లల చెరువు మండలం చేపలమడుగు సర్పంచ్ తమ్మినేని సత్తిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన వైయస్ జగన్మోహన్ రెడ్డికి నియోజకవర్గంలోని పార్టీ పరిస్థితి గతులను వివరించారు.ఆయనతోపాటు ఎర్రగొండపాలెం ఎమ్మెల్యే తాడిపత్రి చంద్రశేఖర్ కలిశారు.

## ఆర్థిక సాయం అందజేసిన డాక్టర్ మన్నే రవీంద్ర



ఎర్రగొండపాలెం ఇంచార్జి - కాకర్లకోటయ్య (శుభోదయం న్యూస్): పుల్లలచెరువు మండలం కొమరోలు గ్రామంలో శనివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో కాలిపోయిన ఇంటిని జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ డాక్టర్ మన్నె రవీంద్ర గారు పరిశీలించారు. అనంతరం బాదితులను పరామర్శించి పదివేల రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తరపున వారిని ఆదుకుంటామని తెలిపారు. ఆయన వెంట కొమరోలు సర్పంచి కొల్లిపాటి శ్రీను మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు..

## అభివృద్ధి సంక్షేమం ఉగ్ర నరసింహారెడ్డి కే సాధ్యం పువ్వాడి వెంకటేశ్వర్లు ,ఏలూరి వెంకటేశ్వర్లు



ప్రకాశం జిల్లా బ్యూరో - చంద్ర (శుభోదయం న్యూస్): అభివృద్ధి ,సంక్షేమం కూటమి ప్రభుత్వానికే సాధ్యమని పామూరు మండల టిడిపి అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు, జిల్లా తెలుగు రైతు అధ్యక్షులు ఏలూరి వెంకటేశ్వర్లు అన్నారు. కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పామూరు పట్టణంలోని పలు ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి ఐదు కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయడం జరిగింది. అందులో భాగంగా సోమవారం పట్టణంలోని పువ్వాడి రాధాకృష్ణ నగర్ లో పువ్వాడి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సిసి రోడ్డు నిర్మాణానికి పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పువ్వాడి తిరుపతమ్మ, తెలుగు రైతు అధ్యక్షులు ఏలూరి వెంకటేశ్వర్లు, బిల్డర్ పువ్వాడి వెంకటేశ్వర్లు, పువ్వాడి రాము, సయ్యద్ అమీర్ బాబు, తడికి మల్ల సుబ్బారావు, షేక్ కాజా రహమతుల్లా, పులి నాయబా పంచాయతీరాజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర అధికార ప్రతినిధిగా తాటి పత్రి చంద్రశేఖర్.



యర్రగొండపాలెం ఇంచార్జి - కాకర్ల కోటయ్య (శుభోదయం న్యూస్): వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా యర్రగొండపాలెం శాసనసభ్యులు తాడిపత్రి చంద్రశేఖర్ ను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి నియమించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తాడిపత్రి చంద్రశేఖర్ మాట్లాడుతూ నా మీద నమ్మకంతో నాకు ఈ పదవి ఇచ్చినందుకు వైయస్ జగన్మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## సభ్యత్వ నమోదు ప్రక్రియను పర్యవేక్షిస్తున్న సయ్యద్ అమీర్ బాబు



ప్రకాశం జిల్లా బ్యూరో- చంద్ర (శుభోదయం న్యూస్ ): కనిగిరి నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి ఆదేశాలతో పామూరు పట్టణంలో టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 270 బూత్ పరిధిలో జరుగుతున్న సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని స్థానిక నాయకులకు పలు సూచనలు చేసిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు సయ్యద్ అమీర్ బాబు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి సభ్యత్వ నమోదులో కనిగిరి నియోజకవర్గం లో పామూరు మండలం ప్రథమ స్థానంలో ఉండేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సిద్ధవటం తిరుపతయ్య, కోన చెన్నయ్య పలువురు మహిళలు పాల్గొన్నారు.

## సభ్యత్వ నమోదు ప్రక్రియ నిర్వహిస్తున్న బత్తుల నాగేశ్వరరావు





ప్రకాశం జిల్లా బ్యూరో- చంద్ర (శుభోదయం న్యూస్): కనిగిరి నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి ఆదేశాలతో పామూరు పట్టణంలో టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 277బూత్ పరిధిలో జరుగుతున్న సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని పలువురికి టిడిపి సభ్యత్వ నమోదు నిర్వహించిన బూత్ ఇన్చార్జి బత్తుల నాగేశ్వరరావు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి సభ్యత్వ నమోదులో కనిగిరి నియోజకవర్గం లో పామూరు మండలం ప్రథమ స్థానంలో ఉండేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు, పలువురు మహిళలు పాల్గొన్నారు.

## దొంగతనం కేసులో ముద్దాయిలు కోర్టులో హాజరు పరిచిన ఎస్సై మరియు సీఐ

లింగసముద్రం, రిపోర్టర్ - కే సురేష్ (శుభోదయం న్యూస్ ): ఈనెల నాలుగో తేదీ అర్ధరాత్రి పెద్దపవని గ్రామంలో రామిశెట్టి మాలకొండయ్య గారి ఇంటిలో జరిగిన దొంగతనం కేసులో 6 రు ముద్దాయిలను అనగా ఈరోజు అనగా తేదీ 11.11. 2024 ఉదయం 7:30 గంటలకు గుడ్లూరు సిఐ గారు మరియు లింగసముద్రం ఎస్ఐ గారు వారి సిబ్బంది కొత్తపేట జంక్షన్ వద్ద ముద్దాయిలను అరెస్టు చేసి వారి వద్ద నుండి 250 గ్రాములు వెండి మరియు 20 గ్రాములు బంగారంను స్వాధీన పరచుకోవడం అయింది. వారిని కందుకూరు కోర్టు నందు హాజరు పరచడమైనది ఆరుగురిలో ముద్దాయిలు లో ఒకరు నెల్లూరు టౌన్ చెందినవారు ఒకరు బుచ్చికి చెందినవారు ఒకరు ఒరిస్సా రాష్ట్రానికి మరియు ఒకరు పశ్చిమబెంగాల్ రాష్ట్రముకి చెందినవారు అయి ఉన్నారు.

## ఆర్ఆర్ పాలెంలో మెడికల్ క్యాంపు



లింగసముద్రం, రిపోర్టర్ - కే సురేష్ (శుభోదయం న్యూస్):లింగసముద్రం మండల గ్రామలలో జ్వరాలు విపరీతంగా ఉండడం వల్ల ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులకు వైద్య సేవలు అందించాలని ఉద్దేశంతో రా చెరువు రాజుపాలెం మండల వైద్యాధికారి డాక్టర్ రమేష్ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు సోమవారం నిర్వహించారు.ఈ సందర్భంగా మెడికల్ క్యాంపులో 73 మందికి వివిధ రకములైన వ్యాధులతో బాధపడుతున్న వారికి చికిత్స చేయడం జరిగినది .వీరిలో క్రితం లో జ్వరం వచ్చి తగ్గిన వారు కీళ్ల నొప్పులతో 13 మంది బాధపడుతున్న వారు అధికంగా ఉన్నారు. కొత్తగా రెండు జ్వరములు కేసులు నమోదైనవి .వారికి కూడా డెంగు సంబంధించిన పరీక్షలు నిర్వహించగా నెగిటివ్ వచ్చింది.తదుపరి పర్యవేక్షకులు టీము గా ఏర్పడి ఆ ఊరిలో ఇంటింటిని సందర్శించి కీటక జనిత వ్యాధులపై అవగాహన కల్పించి, ఫ్రైడే డ్రైడే అనగా శుక్రవారం చేయవలసిన పనుల గురించి విశదీకరించి, వ్యక్తిగత పరిశుభ్రత పై అవగాహన కల్పించి, పరిసరాల పరిశుభ్రత గురించి గ్రామ ప్రజలందరికీ అవగాహన కల్పించారు.స్థానిక సర్పంచ్ ఆ ఊరిలో ఓవర్ హెడ్ ట్యాంక్ ని ప్రతి వారానికి రెండుసార్లు క్లోరినేషన్ చేయించవలసినదిగా మరియు అపరిశుభ్రతమైన వీధుల్లో బ్లీచింగ్ చెల్లించవలసినదిగా తెలియజేయడమైనది.ఎవరైనా జ్వరములతో బాధపడుతూ ఉంటే వారిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రమునకు తప్పనిసరిగా తీసుకురావలసినదిగా తెలియజేస్తూ వారికి అవసరమైన అన్ని టెస్టులు నిర్వహిస్తామని తెలియజేసినారు.

## అయ్యప్ప స్వాముల పడిపూజ మహోత్సవం



నరసరావుపేట(శుభోదయం న్యూస్ ):: శబరిగిరి హైట్స్ ఐదవ లైను ఎన్జీవో కాలనీ నరసరావుపేట లో శ్రీ ఆంజనేయులు గురుస్వామి గారిచే 11/11/ 2024 సాయంత్రం 6 గంటలకు18 మెట్ల కలశ పూజ కార్యక్రమం, మహాగణపతి పూజ శ్రీ హరహరపుత్ర అయ్యప్ప స్వామి వారి నవవిధ అభిషేకములు నిర్వహించి. శ్రీ కుమారస్వామి భజన బృందం , వినయ్ స్వామి బృందం చే అయ్యప్ప నామ సంకీర్తన జరుగును. పూజ అనంతరం అల్పాహార విందు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆహ్వానించిన వారు, మక్కిన జగదీష్ చంద్ర ప్రసాద్.

## తనకల్లు ఏఈఓగా ప్రశాంతి



తనకల్లు, మండల రిపోర్టర్ - రవీంద్ర (శుభోదయం న్యూస్):తనకల్లు మండల వ్యవసాయ ఏఈఓగా ప్రశాంతి నియమించారు. ఈమె గతంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ గా నల్లచెరువు మండలంలో సచివాలయంలో ఎంపికై ఎం అగ్రహారం అనే గ్రామంలో నల్లచెరువులో ఐదు సంవత్సరాలుగా పనిచేస్తూ ఉన్నది తదుపరి ప్రమోషన్ లో సీనియార్టీ ప్రకారం ఎంపికై ఏఈఓగా ప్రమోషన్ పొంది ఈరోజు ఏఈఓగా తనకల్ మండలంలో వ్యవసాయ శాఖలో జాయిన్ అవ్వడం జరిగిందని వ్యవసాయ అధికారి హరినాయక్ తెలిపారు.

## లింగంపేట మండలంలో ఎమ్మెల్యే పర్యాటన మండల అధ్యక్షుడు నారాగౌడ్



కామారెడ్డి జిల్లా ప్రతినిధి పోచయ్య (శుభోదయం న్యూస్ ):- లింగంపేట్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులకు కార్యకర్తలకు తెలియజేయునది మంగళవారం.12.11.2024, ఎల్లారెడ్డి నియోజకవర్గ శాసనసభ్యులు మదన్ మోహన్ లింగంపేట్ మండల కేంద్రంలోని గల మైనారిటీ హాస్టల్ ను సందర్శించనున్నారు. అనంతరం పోల్కంపేట్ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆసుపత్రిని ప్రారంభించనున్నారు.లింగంపేట్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనగలరు.

## వికలాంగులకు పోరాట సమితి జెండా ఆవిష్కరణకు స్థలం కేటాయించండి.




సింగరాయకొండ, మండల రిపోర్టర్- పసుమర్తి జాలయ్య (శుభోదయం న్యూస్ ):సింగరాయకొండ వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో సింగరాయకొండ గ్రామపంచాయతీ కార్యదర్శినీ కలిసి వికలాంగులకు పోరాట సమితి జెండా ఆవిష్కరణ చేసుకునే విధంగా స్థలం కేటాయించమని మండల వికలాంగులు వినతిపత్రం అందజేశారు.అందించిన వారిలో సన్నిబోయిన నాగేశ్వరరావు, సినిగి సురేంద్ర ఉన్నారు.

## ఇంటర్నేషనల్ స్కేటింగ్ రింక్ లో నిర్వహించిన పోటీలలో సందు కోటేశ్వర్

రింక్-2 రోడ్డు -1 గోల్డ్ మెడల్






మంగళగిరి:(శుభోదయం న్యూస్ ):36 వ ఇంటర్ డిస్ట్రిక్ట్ రోలర్ స్కేటింగ్ ఛాంపియన్షిప్ - 2024లోఆంధ్రప్రదేశ్ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ వారు నవంబర్ 6 నుంచి 9 వరకు కాకినాడ ఇంటర్నేషనల్ స్కేటింగ్ రింక్ లో నిర్వహించిన పోటీలలో గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం ఉండవల్లి గ్రామానికి చెందిన సందు కోటేశ్వర్రింక్-2 గోల్డ్ మెడల్, రింక్-3 గోల్డ్ మెడల్, రోడ్డు -1 గోల్డ్ మెడల్ సాధించడం జరిగింది.ఆంధ్రప్రదేశ్ నుంచి 9-11 విభాగంలో నేషనల్ కి సెలెక్ట్ అవ్వడం జరిగింది.దీనికిగాను పలువురు ప్రశంసలను అందుకున్నాడు. టీం బార్న్ నుండి కోచులు వరుణ్ కృష్ణ దిలీప్ల ప్రశంసలు అందుకున్నాడు.

# ఉషశ్రీ చరణ్ కొంచెం నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడండి కదిరి నియోజకవర్గం ఇంచార్జీ భైరవ ప్రసాద్



తనకల్లు, మండల రిపోర్టర్ - రవీంద్ర (శుభోదయం న్యూస్ ):: వైఎస్ఆర్సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ గారు మాట్లాడుతూ రాష్ట్రంలో శాంతి భద్రతలు లోపించాయనీ, వైఎస్ఆర్సీపీ పార్టీ నాయకులపై సోషియల్ మీడియా కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి హింసిస్తున్నారని కూటమి ప్రభుత్వం వైఫల్యం చెందింది అని, కదిరి నియోజక వర్గంలో అభివృద్ధి జరగలేదని, ఎన్నికల హామీలు నెరవేర్చలేదని విమర్శ చేశారు.దీనికి సమాధానంగా కదిరి నియోజక వర్గం ఇంచార్జీ భైరవ ప్రసాద్ మీడియా సమావేశం ఏర్పాటు చేసి "గత అసమర్థ పాలకులు జగన్ మోహన్ రెడ్డి అన్నీ వ్యవస్థలను నాశనం చేసి, ఈ రాష్ట్రాన్ని ఆర్థికంగా ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితికి దిగజారిస్తే,అన్ని వ్యవస్థలను చక్కదిద్దుతూ ఈ రాష్ట్ర అభివృద్ధి కోసం గౌరవ ముఖ్యమంత్రివర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ కేంద్ర ప్రభుత్వం సహకారంతో నిధులను మంజూరు చేపిస్తూ పల్లె పండుగ పేరుతో 4500 కోట్లతో గ్రామ గ్రామాన రోడ్లు వేపిస్తున్నారు, అంతే కాకుండా ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం వృద్దులకు 7000? రూపాయల పించన్ , దీపావళికి దీపం 2.0 పథకం ద్వారా మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్ , భవన నిర్మాణం కోసం ఉచిత ఇసుక పాలసీ విధానం , పారదర్శకంగా మద్యం పాలసీ విధానం , నిరుద్యోగులకు మెగా డిఎస్సీ నోటిఫికేషన్ , రాష్ట్రంలో కొత్త పరిశ్రమల స్థాపన కోసం కృషి చేస్తున్న ప్రభుత్వాన్ని ప్రజలు ఇది మంచి ప్రభుత్వం అంటూ హర్షిస్తున్నారు.రాష్ట్రంలో ఎవరైతే అసాంఘిక చర్యలకు పాల్పడుతూ మహిళలపై, చిన్నారులపై అఘాయిత్యాలకు పూనుకొని శ్రీ నారా చంద్రబాబు నాయుడు, శ్రీ పవన్ కళ్యాణ్ కుటుంబ సభ్యులపై, ఆఖరికి వైఎస్ విజయమ్మ , షర్మిలపై సోషయల్ మీడియాలో సైతం మహిళలపై అతి నీచాతి నీచంగా పోస్టు పెడుతూ ,అవాస్తవాలని ప్రచారం చేస్తున్న సైకోలపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతోంది.కదిరి నియోజకవర్గంలో వైఎస్ఆర్సీపీ పార్టీ నాయకులు పేద ప్రజల భూములను దొంగ పత్రాలు సృష్టించిన వారిపై చర్యలు తీసుకుంటుంటే దాని గురించి మాట్లాడకుండా ఎన్ డి ఎ కూటమి శాసన సభ్యులు శ్రీ కందికుంట వెంకట ప్రసాద్ కదిరి ప్రాంతాన్ని అభివృద్ధి చెయ్యలేదు అని అవాస్తవాలు చెప్తున్నారు.మీకు తెలియకపోతే మీ చుట్టూ ఉన్న వైఎస్ఆర్సీపీ నాయకులను అడగండి " కదిరి నుంచి రాయచోటి ప్రాంతానికి వేస్తున్న ప్రధాన రహదారి గురించి , హంద్రనీవా ద్వారా తలుపుల మండలం , ఎన్ .పి . కుంట మండలాలకి నీరు అందించిన ఘనత ఎవరికైనా దక్కింది అంటే అది కందికుంట ప్రసాద్ కే చెల్లింది. ఇప్పటికే గ్రామాలలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన కందికుంట ప్రసాద్ చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రభుత్వ భూములను కాజేసిన వారిని, వదిలే ప్రసక్తే లేదని ఆయన ఇప్పటికే స్పష్టం చేశారు.రాష్ట్ర అభివృద్ధి కోసం కృషి చేస్తున్న నారా చంద్రబాబు నాయుడుని, పవన్ కళ్యాణ్ ని , కూటమి నాయకులను విమర్శిస్తే చూస్తూ ఊరుకొనే ప్రసక్తే లేదు.మీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఒక మాస్క్ అడిగిన పాపానికి దళిత డాక్టర్ సుధాకర్ ను పిచ్చోడుగా చిత్రీకరించి అతని మరణానికి కారణం అయ్యాడు. మీ పార్టీ ఎమ్మెల్సీ అనంత బాబు దళిత డ్రైవర్ ను చంపేసి డోర్ డెలివరీ చేసినప్పుడు ఏం అయ్యారు..? కల్యాణ దుర్గంలో మీ సొంత పార్టీ నేతలే నీకు టికెట్ ఇవ్వద్దు అనే స్థాయికి చేరారు అంటే మీ అవినీతి ఏ స్థాయిలో ఉందో ప్రజలకు తెలియంది కాదు.%చీణాూ% కూటమి ప్రభుత్వం గురించి మాట్లాడే ముందు ఆలోచన చేసుకొని మాట్లాడాలని నోటికి వచ్చినట్లుగా మాట్లాడితే సహించేది లేదని తెలియజేసుకుంటున్నాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నపరెడ్డి,లక్ష్మణ్,రవికుమార్,అంజిబాబు, గంగరాజు, రాజేంద్ర ప్రసాద్, రమణ,ప్రతాప్, రాజా రమణ,రఘు,నాగరాజు, అరవింద్, సోముశేఖర్, గణేష్ నాయక్,కృష్ణకాంత్ , సాయి , కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

## సభ్యత్వ నమోదు ప్రక్రియను పర్యవేక్షిస్తున్న సయ్యద్ అమీర్ బాబు



ప్రకాశం జిల్లా బ్యూరో- చంద్ర (శుభోదయం న్యూస్): కనిగిరి నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి ఆదేశాలతో పామూరు పట్టణంలో టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 270 బూత్ పరిధిలో జరుగుతున్న సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని స్థానిక నాయకులకు పలు సూచనలు చేసిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు సయ్యద్ అమీర్ బాబు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి సభ్యత్వ నమోదులో కనిగిరి నియోజకవర్గం లో పామూరు మండలం ప్రథమ స్థానంలో ఉండేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సిద్ధవటం తిరుపతయ్య, కోన చెన్నయ్య పలువురు మహిళలు పాల్గొన్నారు.

## సభ్యత్వ నమోదు ప్రక్రియ నిర్వహిస్తున్న బత్తుల నాగేశ్వరరావు




ప్రకాశం జిల్లా బ్యూరో- చంద్ర (శుభోదయం న్యూస్ ): కనిగిరి నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి ఆదేశాలతో పామూరు పట్టణంలో టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 277బూత్ పరిధిలో జరుగుతున్న సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని పలువురికి టిడిపి సభ్యత్వ నమోదు నిర్వహించిన బూత్ ఇన్చార్జి బత్తుల నాగేశ్వరరావు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి సభ్యత్వ నమోదులో కనిగిరి నియోజకవర్గం లో పామూరు మండలం ప్రథమ స్థానంలో ఉండేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు, పలువురు మహిళలు పాల్గొన్నారు.

## విద్యార్థులందరూ ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి : బిగ్ హెల్ప్ చైర్మన్ చాంద్ పాషా




మాచర్ల, నియోజకవర్గం ఇంచార్జ్ - చిన్న గురవయ్య (శుభోదయం న్యూస్): విద్యార్థులందరూ క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, తల్లిదండ్రులకు, చదువుకున్న పాఠశాలలకు, విద్య నేర్పిన గురువులకు మంచి పేరు తేవాలని బిగ్ హెల్ప్ ఫర్ ఎడ్యుకేషన్ ఫౌండర్ అండ్ చైర్మన్ షేక్ చాంద్ పాషా అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 3 లక్షల 50 వేల రూపాయలతో నిర్మించిన ఆడిటోరియంను ఆయన సోమవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సన్మానసభలో ఆయన మాట్లాడుతూ బిగ్ హెల్ప్ ఎడ్యుకేషన్ ద్వారా రెండు తెలుగు రాష్ట్రాల్లో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా 1500 మంది అనాద




విద్యార్థులను చదివిస్తున్నట్లు తెలిపారు.వారి ఉన్నత విద్య వరకు సహకరిస్తున్నామన్నారు. అదేవిధంగా జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో 3 లక్షల 10వేల తో ఆడిటోరియం నిర్మించామన్నారు.అదే పాఠశాలలో విద్యార్థినిలకు టైలరింగ్ ఎంబ్రాయిడరీ నేర్పిస్తున్నట్లు తెలిపారు.రెండు తెలుగు రాష్ట్రాల వ్యాప్తంగా ఎన్ఎంఎంఎస్ కోచింగ్ కు అవసరమయ్యే మెటీరియల్ అందిస్తున్నట్లు తెలిపారు. రెండు రాష్ట్రాల వ్యాప్తంగా 52 ప్రాజెక్టులు ఉన్నట్లు పేర్కొన్నారు.తాను చదువుకున్న విజయపురి సౌత్ గవర్నమెంట్ హై స్కూల్లో 5 లక్షల రూపాయలతో అక్కడ కూడా ఆడిటోరియం నిర్మించినట్లు తెలిపారు.తల్లిదండ్రులు లేనివారికి ఉన్నత విద్య వరకు తమ ట్రస్ట్ ద్వారా విద్యనందిస్తామని పేర్కొన్నారు. హై స్కూల్ హెచ్ఎం రామారావు మాట్లాడుతూ తమ పాఠశాల అభివృద్ధికి సహకరించిన బిగ్ హెల్ప్ ఫర్ ఎడ్యుకేషన్ చైర్మన్ చాంద్ పాషా కు కృతజ్ఞతలు తెలిపుతూ వారి సేవా కార్యక్రమాలను అభినందించారు.ఈ కార్యక్రమంలో మేనేజింగ్ ట్రస్టీ మాటూరి సరోజిని, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు తాటి భాస్కర్ బాబు, పగిడిమర్ల మల్లేష్,అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శంకరయ్య,ధనలక్ష్మి,తాటి రాజశేఖర్,ఆయా పాఠశాలల హెచ్ఎంలు,ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్కేటింగ్ పోటీల్లో మంగళగిరి క్రీడాకారులు సత్తా.







మంగళగిరి(శుభోదయం న్యూస్ ):రాష్ట్రస్థాయి 36వ స్కేటింగ్ పోటీల్లో మంగళగిరి క్రీడాకారులు మాత్రపు జెస్సి రాజ్, మాత్రపు జోయల్ ఆదర్శ్ సత్తా చాటారు. ఈ నెల 6 మంచి 11వ తేదీ వరకు స్థానిక మంగళగిరిలోని మున్సిపల్ స్కేటింగ్ పార్క్ లో జరిగిన ఈ పోటీలకు రాష్ట్రవ్యాప్తంగా 250 మంది క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించారు. ఈ పోటీల్లో జెస్సిరాజ్ మూడు(ఇన్ లైన్ విభాగంలో సిల్వర్, సోలో డాన్స్ విభాగంలో సిల్వర్, ఫిగర్ విభాగంలో బ్రాంచ్) పతకాలను సొంతం చేసుకుంది. అదేవిధంగా జోయల్ ఆదర్శ్ రెండు(ఇన్ లైన్ విభాగంలో బ్రాంచ్, ఫిగర్ విభాగంలో బ్రాంచ్) పతకాలను సాధించాడు. వీరిద్దరూ మంగళగిరిలోని విక్టరీ స్కేటింగ్ అసోసియేషన్ అకాడమీలో గత కొన్నేళ్లుగా శిక్షణ పొందుతున్నారు. పతకాలు సాధించిన క్రీడాకారులను ఏపీ స్కేటింగ్ సంఘం కార్యదర్శి థామస్ చౌదరి, చైర్మన్ పవన్ కుమార్, సీనియర్ కోచ్ సింహాద్రి అభినందించారు. కాగా జెస్సిరాజ్ ఇటీవల న్యూజిలాండ్ లో జరిగిన ప్రపంచ స్థాయి ఆర్టిస్ట్ విషయానికి స్కేటింగ్ పోటీల్లో ప్రథమ స్థానం సాధించి బంగారు పతకం కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని అప్పట్లోనే రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

# చీరందంలో షేక్ చేసిన షాకింగ్ బ్యూటీ!



బాలీవుడ్ బ్యూటీ ఫాతిమా షనా షేక్ సుపరిచితమే. చైల్డ్ ఆర్టిస్ట్ గా ఎంట్రీ ఇచ్చిన బ్యూటీ 'దంగల్' సినిమాతో దేశమంతా ఫేమస్ అయింది. ఆ ఒక్క పాత్ర ఫాతిమా బాలీవుడ్ కెరీర్ నే మార్చేసింది. గీతా ఫోగాట్ పాత్రలో అమ్మడు అభినయించిన తీరు గొప్ప పేరును తీసుకొచ్చింది. ఆ పాత్రలో ఫాతిమా సెటిల్డ్ పెర్ఫార్మెన్స్ ఎన్నో ప్రశంసలు తెచ్చి పెట్టింది. ఆ సినిమా తర్వాత నటిగా బిజీ అయింది. / అంతకుముందు మెయిన్ లీడ్స్ లో కొన్ని సినిమాలు చేసినా..ఏ సినిమా తీసుకురాని గుర్తింపు దంగల్ తీసుకొచ్చింది. ఆ రకంగా ఫాతిమ కెరీర్ లో దంగల్ ఓ గొప్ప చిత్రంగా నిలిచిపోయింది. ఇప్పటికీ అదే క్రేజ్ తో అవకాశాలు అందుకుంటుంది. కానీ ఆ రేంజ్ సక్సెస్ మాత్రం రావడం లేదు. -థగ్స్ ఆఫ్ హిందుస్తాన్- ..-లుడో-.. -సురాజ్ పే మంగల్ బారీ -.. -అజీబ్ దస్తాన్స్ -..-థార్-..-ధక్ ధక్- లాంటి సినిమాలు చేసినా కలిసి రాలేదు. గతేడాది రిలీజ్ అయిన సామ్ బహదూర్ మాత్ర ఊరటనిచ్చిన చిత్రంగా నిలిచింది. వీటన్నింకటే ముందే అమ్మడు టాలీవుడ్ లో %-%నువ్వు నేను ఒకటవుదాం- అనే చిత్రంలో నటించింది. ఆ సినిమా సక్సెస్ అయి తెలుగులో అవకాశాలు వచ్చి ఉంటే ఇక్కడే ఉండేదేమో. కానీ అలా జరగలేదు. ఈ బ్యూటీ సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండటం రేర్. అప్పుడప్పుడు ఫోటోలు పోస్ట్ చేసినా? పద్దతైన ఫోటోలతోనే మెప్పించే ప్రయత్నం చేస్తుంది. అమ్మడు గ్లామర్ షోకి దూరంగా ఉంటుంది. చాలా రేర్ గానే స్కిన్ షో చేస్తుంది. తాజాగా ఫాతిమా చీరందంలో తళుకులీనింది. లైట్ పింక్ బ్యాక్ గ్రౌండ్ ని మ్యాచ్ చేస్తూ క్రీమ్ కలర్ సారీలో ఒదిగిపోయింది. షోల్డెర్ లెజ్ బ్లౌజు సొగసైన ఫోజులిచ్చింది. చెవులకు దిద్దులు ధరించింది అమ్మడి మ్యాకప్ అలకంరణ ప్రతీది మరింత అందంగా తీర్చిదిద్దాయి. ఈసారి మాత్రం కాస్త స్కిన్ షోకి ఛాన్స్ ఇచ్చింది. టోన్డ్ బాడీని హైలైట్ చేసే ప్రయత్నం చేసింది. నడుము ఒంపు సొంపుల్లో యద అందాలతో మైమరిపించింది. ప్రస్తుతం ఈ ఫోటో నెట్టింట వైరల్ అవుతోంది.

# రకుల్ వేగం అక్కడా తగ్గినట్లుందే!




గడిచిన రెండేళ్ల కాలంలో రకుల్ ప్రీత్ సింగ్ ఏ రేంజ్ లో సినిమాలు చేసిందో చెప్పాల్సిన పనిలేదు. వచ్చిన ఏ అవకాశాన్ని విడిచిపెట్టలేదు. చిన్న పెద్ద అనే సినిమా లేకుండా పనిచేసింది. ఒకానొక దశలో అమ్మడి వేగం చూసి కిలాడీ అక్షయ్ కుమార్ నే పక్కకు నెట్టేస్తుందా? అన్న సందేహం సైతం తెరపైకి వచ్చింది. అంతటి ఇబ్బడి ముబ్బడిగా సినిమాలు చేసింది. అయితే 2024లో మాత్రం ఆ వేగంగా బాగా తగ్గింది. / ఇప్పటి వరకూ ఈ ఏడాది కేవలం - ఆయలాన్-, - ఇండియన్-2 - సినిమాలతో మాత్రమే ప్రేక్షకుల ముందుకొచ్చింది. వీటిలో ఆయలాన్ మాత్రమే సక్సెస్ అయింది. భారీ అంచనాల మధ్య రిలీజ్ అయిన ఇండియన్-2 మాత్రం డిజాస్టర్ గా మిగిలింది. మరి ప్రస్తుతం అమ్మడి లైనప్ ఎలా ఉంది? అంటే పూర్తిగా డల్ గానే కనిపిస్తోంది. %-% ఇండియన్ -2 - కి కంటున్యూటీగా -ఇండియన్- 3%-% లోనూ కనిపిస్తుంది. కాబట్టి ఆ చిత్రాన్ని కౌంట్ చేయాల్సిన పనిలేదు. మరి చేతిలో ఉన్న సినిమా లెక్క? ఏంటి అంటే కేవలం ఒక్క చిత్రం మాత్రమే ఉంది. అదే %-%దే దే ప్యార్ దే- 2%-%. ఈ సినిమా తప్ప ఇంకే సినిమా చేతిలో లేదు. ఈ సినిమా వచ్చే ఏడాది సమ్మర్ లో రిలీజ్ అవుతుంది. అంతవరకూ రకుల్ సినిమాల కోసం ఎదురు చూడాల్సిన పనిలేదు. మొత్తంగా చూస్తే రకుల్ డైరీ ఇప్పుడు పూర్తి ఖాళీగా కని పిస్తుంది. సక్సెస్ వస్తే తప్ప కొత్త సినిమాలు వచ్చే పరిస్థితి కనిపించలేదు. ఇక సోషల్ మీడియాలో మాత్రం అమ్మడు నిత్యం యాక్టివ్ గానే కొనసాగుతుంది. ఎప్పటికప్పుడు కొత్త ఫోటోలతో కుర్రాళ్లను హీటెక్కిస్తుంది. పెళ్లైనా అమ్మడు ఏమాత్రం వేగం తగ్గించలేదు. తాజాగా ఎల్లో ఇండియా కవర్ పేజీపై తళుక్కున మెరిసింది. బ్లూ కాంబినేషన్ దుస్తుల్లో మిరుమిట్లు గొలుపుతుంది. అమ్మడి మ్యాకప్ అలంకరణ ప్రతీది రకుల్ బ్యూటీని అంతకంతకు రెట్టింపు చేసింది. ప్రస్తుతం ఈ ఫోటో నెట్టింట వైరల్ గా మా



# రియా బోల్డ్ డెనిమ్ లుక్ వైరల్



ఊహించనిది జరిగితే దానిని ఎదుర్కోవడమే ధైర్యవంతుని లక్షణం. అలాంటి ధైర్యం తనకు ఉందని నిరూపించింది రియా చక్రవర్తి. తూనీగ తూనీగ సినిమాతో టాలీవుడ్ లో అడుగుపెట్టిన రియా చక్రవర్తి బాలీవుడ్ యువహీరో సుశాంత్ సింగ్ తో ప్రేమాయణం సాగించడం, డ్రగ్స్ స్కామ్, మనీలాండరింగ్‌లో తన పేరు వినిపించడం, అనంతరం సుశాంత్ ఆత్మహత్య వగైరా సంచలనాలు అయ్యాయి. ఈ కేసులో రియా చక్రవర్తి అరెస్టయి జైలులో కొన్ని నెలలపాటు ఉండాల్సి వచ్చింది. ప్రస్తుతం బెయిల్ పై బయటే ఉన్న రియా తిరిగి తన జీవితాన్ని కొత్త కోణంలో చూపించేందుకు చేయని ప్రయత్నం లేదు. రియా చక్రవర్తి తన మాజీ ప్రియుడు, నటుడు సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ జూన్ 2020లో మరణించిన తర్వాత తనపై వచ్చిన అభియోగాలు క్లియర్ కావడానికి ముందు కొంతకాలం జ్యుడీషియల్ రిమాండ్‌లో కూడా ఉంది. దీనిపై అప్పట్లో హ్యూమన్స్ ఆఫ్ బాంబేతో మాట్లాడిన రియా, వీటన్నింటికీ ముందు తాను భ్రమలతో కూడుకున్న ఆశావాదిని అని తెలిపింది. తాను ఎప్పుడూ తన పనిని ఆస్వాధించాలనుకుంటానని, ఎలాంటి లక్ష్యాలు లేకుండా ఆర్థికంగా స్వతంత్రంగా ఉండాలని కోరుకుంటానని రియా చక్రవర్తి అన్నారు. ఆరోపణల కారణంగా..దేశం మొత్తం నాపై ఎలాంటి అభిప్రాయాన్ని కలిగి ఉంటుందో, మంచి లేదా చెడును మరచిపోతుందని నేను కచ్చితంగా ఊహించలేను! నటిగా కూడా నా ఆశయం ఎప్పుడూ నంబర్ 1 కాదు.. నేను ఒక క్రాఫ్ట్‌గా నటనను ఆస్వాధించడం ప్రారంభించాను. దాని గురించి లక్ష్యాలు లేవు. జగరబోయేదానికి ఎవరూ నన్ను సిద్ధం చేయలేదు. వారు నన్ను.. చుడైల్, కాలా జాదు కర్నే వాలీ, నాగిన్ లాంటి పేర్లతో పిలుస్తారు.. కానీ నేను దేనినీ నిజంగా పట్టించుకోను. ఇలాంటివి ఇంతకుముందు నన్ను కలవరపెట్టేవి కానీ ఇప్పుడు కాదు! అని తెలిపింది. అయితే రియా తన జీవితాన్ని తిరిగి పొందాలంటే %-%క్షమించే మార్గం%-%లో వెళ్ళవలసిందిగా భావించానని, దాదాపు బలవంతంగా ఇది జరిగిందని చెప్పింది. జరిగి నదంతా క్షమించాలని నా హృద యంలో ఉంటుందని నేను అనుకోలేదు. కానీ నేను చాలా కాలంగా చాలా కోపంగా ఉన్నందున క్షమాగుణం సింపుల్ మార్గంగా మారింది. నాకు వచ్చిన కోపం అంతా గట్ సమస్యలు.. అసిడిటీ మాత్రమే. నేను దాదాపు మూడేళ్లపాటు ఎసిడిటీతో చాలా బాధపడ్డాను. క్షమాపణ ఒక్కటే ఆప్షన్‌గా మారింది. నేను దాదాపు క్షమాపణ మార్గంలోకి వెళ్ళవలసి వచ్చింది.. అని తెలిపింది. 2020లో సుశాంత్ మరణించిన తర్వాత, రియా అతడి ఆత్మహత్యకు ప్రేరేపించిందని ఆరోపణలు వచ్చాయి. మనీలాండరింగ్ ఆరోపణలపై రియాను ఆమె సోదరుడు షోక్‌ను కూడా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) ప్రశ్నించింది. సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ) కేసును స్వాధీనం చేసుకున్న తరువాత, నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సిబి) సుశాంత్‌కు గంజాయి సరఫరా చేశారనే ఆరోపణతో రియాను ఆమె సోదరుడిని అరెస్టు చేసింది. అయితే సుశాంత్ డ్రగ్స్ వ్యసనానికి రియా ఆర్థిక సహాయం చేసిందనే ఎన్‌సిబి సిద్ధాంతాన్ని బాంబే హైకోర్టు తిరస్కరించింది. రియా వరుస ఫోటోషూట్లు: రియా చక్రవర్తి ఇటీవల గతాన్ని మరిచి యాక్టివ్ గా ఉంటోంది. సోషల్ మీడియాల్లో నిరంతరం తన లేటెస్ట్ ఫోటోషూట్లను షేర్ చేస్తూ అభిమానుల్లో ఉత్సాహం నింపుతోంది. ఒక వివాదం తర్వాత తనకు అవకాశాలిచ్చేవారు కరువయ్యారు. కానీ మొక్కవోని ధీక్షతో తన వంతు ప్రయత్నాలను ఆపడం లేదు. ఇటీవల సోషల్ మీడియాల్లో రియా గ్లామ్ ఫోటోగ్రాఫ్స్ వేగంగా వైరల్ అవుతున్నాయి. తాజా ఫోటోషూట్ లో రియా డెనిమ్స్ లో స్టన్నింగ్ లుక్ తో కనిపించింది. ఓవైపు డెనిమ్స్ ధరించినా ఇన్నర్ అందాలను ఎలివేట్ చేయడంలో రియా ఎక్కడా తగ్గలేదు. మెడలో గోల్డ్ పెండెంట్ చైన్ రియా అందాలను స్పైసప్ చేసింది. ప్రస్తుతం ఈ ఫోటోగ్రాఫ్స్ అంతర్జాలంలోకి దూసుకెళుతున్నాయి.



# పుష్పరాజ్ రూల్ ఒక్క రోజు ముందుగానే!

పుష్పరాజ్ జాతర ఒకరోజు ముందుగానే ప్రారంభం కాబోతోంది. బ్లాక్ బస్టర్ 'పుష్ప: ది రైజ్' సీక్వెల్ గా తెరకెక్కుతున్న "పుష్ప 2: ది రూల్" సినిమా ప్రీపోన్ అయింది. అవును.. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ సినిమా ముందుగా ప్లాన్ చేసిన సమయం కంటే ఒక్క రోజు ముందుగానే థియేటర్లలోకి రాబోతోంది. ఈ విషయాన్ని మేకర్స్ ఈరోజు ప్రెస్ మీట్ పెట్టి మరీ అధికారికంగా ధృవీకరించారు. అభిమానుల కోరిక మేరకు 'పుష్ప 2' చిత్రాన్ని డిసెంబర్ 5న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. "పుష్ప 2: ది రూల్" చిత్రాన్ని 2024 డిసెంబర్ 6వ తేదీన ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు చిత్ర యూనిట్ గతంలో ప్రకటించారు. అయితే ఇప్పుడు ఈ పాన్ ఇండియా సినిమాని డిసెంబర్ 5వ తారీఖునే థియేటర్లలో రిలీజ్ చెయ్యాలని నిర్మాతలు నిర్ణయించుకున్నారు. డిసెంబర్ 4న ఓవర్సీస్ ప్రీమియర్‌లు పడతాయని తెలిపారు. ఈ సందర్భంగా అల్లు అర్జున్ కు సంబంధించిన కొత్త పోస్టర్ ను పంచుకున్నారు. ఇందులో బన్నీ సిగార్ తాగుతూ, చేతిలో ఉన్న తుపాకీని చూస్తూ నిలబడి ఉన్నాడు. నిజానికి 'పుష్ప 2' సినిమా ప్రీపోన్ అవుతుందని చాలా రోజులుగా వార్తలు వస్తున్నాయి. తాజాగా మేకర్స్ ఈ విషయాన్ని అఫీషియల్ గా అనౌన్స్ చేసారు. "వేడుకలు ఒక రోజు ముందుగానే ప్రారంభమవుతాయి.. బాక్సాఫీస్ వద్ద బాణాసంచా ఒక రోజు ముందుగానే పేల్చివేయబడుతుంది.. ఒక రోజు ముందే రికార్డుల వేట జరుగుతుంది.. పుష్ప రాజ్ రూల్ ఒక రోజు ముందుగానే ప్రారంభమవుతుంది. బిగ్గెస్ట్ ఇండియన్ మూవీ 'పుష్ప: ది రూల్' డిసెంబర్ 5న గ్రాండ్ గా ప్రపంచవ్యాప్తంగా విడుదల అవుతుంది" అని పేర్కొన్నారు. మోస్ట్ అవైటెడ్ మూవీ ఒకరోజు ముందుగానే విడుదల కానుందని తెలియడంతో అభిమానులు ఖుషీ అవుతున్నారు. నాలుగు రోజుల వీకెండ్ కలిసొస్తే, బాక్సాఫీస్ షేక్ అవ్వడం గ్యారంటీ అని కామెంట్స్ చేస్తున్నారు. 'పుష్ప 2: ది రూల్' చిత్రానికి సుకుమార్ బండ్రెడ్డి దర్శకత్వం వహించారు. పార్ట్-2 మీదున్న భారీ అంచనాలను దృష్టిలో పెట్టుకొని, ప్రేక్షకులు మునుపెన్నడూ చూడని అనుభూతిని అందించడానికి జీనియస్ డైరెక్టర్ కృషి చేస్తున్నారు. ఇందులో అల్లు అర్జున్ సరసన రష్మిక మందన్న హీరోయిన్ గా నటిస్తోంది. ఫహద్ ఫాజిల్, సునీల్, అనసూయ, బ్రహ్మాజీ, సౌరభ్ సచ్ దేవా కీలక పాత్రలు పోషిస్తున్నారు. రాక్ స్టార్ దేవి శ్రీ ప్రసాద్ సంగీతం సమకూరుస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్స్ పై నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి భారీ బడ్జెట్ తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శేషాచలం అటవీ ప్రాంతంలో కూలీగా తన ప్రయాణాన్ని మొదలుపెట్టిన పుష్పరాజ్.. ఎర్రచందనం సిండికేట్‌ను శాసించే స్థాయికి ఎలా ఎదిగాడనేది 'పుష్ప ది రైజ్' లో చూపించారు. ఆ తర్వాత పుష్పరాజ్ కి ఎదురైన సవాళ్లు ఏంటి? వాటిని అతను ఎలా ఎదుర్కొన్నాడు? ఎలా రూల్ చేశాడు? అనే ఆసక్తికరమైన అంశాలతో "పుష్ప ది రూల్" సినిమా రెడీ అవుతోంది. ఇందులో విజువల్స్, యాక్షన్, మ్యూజిక్.. ఇలా సినిమాకి సంబంధించిన ప్రతి ఒక్కటీ అద్భుతంగా ఉంటుందని చిత్ర బృందం చెబుతోంది. ఇప్పటికే రిలీజైన ప్రమోషనల్ కంటెంట్ కు మంచి రెస్పాన్స్ వచ్చింది. మరి 'పుష్ప 2' బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సంచనాలు క్రియేట్ చేస్తుందో చూడాలి.

